ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
సోమవారం 3 జూన్ 2024





సైకిల్ ఉందంటే షావుకారే..

సైకిల్ అంటే నాకు చాలా ఇష్టం. మొదటి సైకిల్‌ను 1970లో రూ.300కు కొన్నాను. ఇప్పుడు నా వయసు ఎనభై ఏళ్లు. సుమారు అరభై ఏళ్లపాటు సైకిల్ తొక్కాను. అప్పట్లో ఒకరకమైన షావుకార్లకే సైకిల్ ఉండేది. మాకు హోటల్ ఉంది. రోజూ బజారుకు వెళ్లి కూరగాయలు కొనేందుకు సైకిల్‌ను బాగా వాడేవాన్ని. గుత్తి నుంచి మిడుతూరుకు గంటలో వెళ్లొచ్చేవాడిని. నా ఇద్దరు కొడుకులకు నా సైకిల్ మీదనే తొక్కడం నేర్పించాను. 1983లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ పెట్టిన తరువాత సైకిల్‌కి క్రేజ్ మరింత పెరిగింది. ప్రతి ఒక్కరూ సైకిల్ కొనడం ప్రారంభించారు. మోకాళ్ల నొప్పుల కారణంగా ఆరు నెలల నుంచి సైకిల్ తొక్కడం లేదు. అయినా రెండు రోజులకు ఒకసారి సైకిల్‌ని తుడుస్తుంటాను. దానితో బంధం అలాంటిది.

- జీసీ నాగరాజారావు, కరణం వీధి, గుత్తి


నాగరాజారావు

సైకిల్‌కే రా.. సై..సై..!


అప్పట్లో కట్నం సైకిలే..!

2 శతాబ్దాలుగా విశిష్ట సేవలు

- యాడికి, గుత్తి రూరల్

'ఏమిటీ..! ఎన్నికల ఫలితాలు రేపు వస్తుంటే.. ఈ రోజే సైకిల్‌కి జైకొట్టారని రాశారు..' అనుకుంటున్నారా..? ఎప్పుడైతేనేం..! కాలం.. ప్రాంతం.. వర్గం.. వర్ణం.. వయో, లింగబేధాలు లేకుండా.. అన్నింటికీ అతీతంగా సైకిల్ అంటే జై కొడతాం కదా..! పసివారి నుంచి పండు ముసలివరకూ సైకిల్‌తో బంధం లేనిది ఎవరికి..? ఈ రోజు ప్రపంచ సైకిల్ దినోత్సవం. అందుకే.. సైకిల్‌తో బంధం గురించి ఈ రోజు ప్రత్యేక కథనం.

సైకిల్..! అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే వాహనం. అత్యంత అనుకూలమైన రవాణా సాధనం. మానవజాతి పురోగమనానికి చిహ్నం. పర్యావరణ హితమైంది.. ఆరోగ్యాన్ని పరిరక్షించేది సైకిల్..! ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేసేందుకు ప్రతి సంవత్సరం జూన్ 3న ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని నిర్వహించుకోవాలని 2018లో ఐక్యరాజ్య సమితి నిర్ణయించింది. రెండు శతాబ్దాలకు పైగా మానవ సమాజానికి విశిష్ట సేవలు అందిస్తున్న సైకిల్ వినియోగాన్ని సుస్థిరపరిచేందుకు ఈ వేడుక ఉపకరిస్తుందన్నది ఐరాస ఉద్దేశం. సైకిల్ తొక్కుతూ.. ప్రజలందరూ సంతోషంగా ఉండాలన్నదే లక్ష్యం..!

అన్ని వర్గాలకు అనుకూల వాహనం
పర్యావరణ హిత రవాణా సాధనం
నేడు ప్రపంచ సైకిల్ దినోత్సవం

యాడికి మండల కేంద్రానికి చెందిన బండారు కేశవయ్య వయసు 72 ఏళ్లు. చేనేత కార్మికుడు. సుమారు 50 ఏళ్ల నుంచి సైకిల్ వాడుతున్నారు. తొలి సైకిల్‌ను రూ.250 వెచ్చించి కొన్నానని, ఇప్పటి వరకు ఒక్క సైకిల్‌ను మాత్రమే మార్చానని అంటున్నారు. ఇప్పటికీ ఆయన సైకిల్ లేకుండా బయటకు అడుగు పెట్టరు. కొన్నేళ్ల నుంచి తాగునీటికి, కూరగాయలకు, స్టోర్‌కు, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు.. ఇలా అన్నింటికీ సైకిల్ వాడటం అలవాటైందని.. ఇంట్లోంచి కాలు బయట పెడితే తెలియకుండానే సైకిల్‌పై చెయ్యి పడుతుందని అంటున్నారు. 'ఇప్పుడు పెళ్లి కొడుకులు బైకులు, కార్లు గిఫ్టుగా అడుగుతుంటారు. కానీ మా కాలంలో సైకిల్ అడిగే సంప్రదాయం ఉండేది.' అని నవ్వుతూ గుర్తు చేసుకున్నారు. తాము అవసరం కోసం సైకిల్ తొక్కేవాళ్లమని, ఇప్పుడు కుర్రకారు ఆరోగ్యం కోసం సైకిల్ తొక్కుతున్నారని అన్నారు.

అప్పట్లో ఆ కథే వేరు..



అప్పట్లో ఆ కథే వేరు.. నా వయసు అరభై ఏళ్లకు పైగా ఉంటుంది. చిన్నప్పుడే సైకిల్ తొక్కడం నేర్చుకున్నాను. నలభై ఏళ్ల నుంచి సైకిల్ షాప్‌తో ఉపాధి పొందుతున్నాను. అప్పట్లో సైకిళ్లను బాడుగకు ఇచ్చేవాడిని. గంటకు రూపాయి.. అరగంటకు అర్ధ రూపాయి ఇచ్చేవారు. రోజంతా తీసుకువెళితే మనిషినిబట్టి ఎంతోకొంత తీసుకునేవాడిని. పల్లెల నుంచి వచ్చేవారు ఎక్కువగా బాడుగకు సైకిళ్లను తీసుకునేవారు. ఇప్పుడు బాడుగ సైకిళ్ల మాటే లేదు. అంతా మారిపోయింది. అయినా ఇప్పటికీ సైకిల్ షాప్ నిర్వహిస్తున్నాను. రిపేరీ, పంక్చర్, గాలి కొట్టించుకునేందుకు వస్తుంటారు. అప్పట్లో సైకిల్‌కు గాలి ఉచితంగానే కొట్టేవాళ్లం. ఆ తరువాత పావలా తీసుకోవడం మొదలైంది. సైకిల్ షాప్ ఉందంటే చుట్టుపక్కల ఊళ్లలో అందరికీ తెలిసిపోయేది. అప్పట్లో ఫోన్‌లు లేవు కదా..? ఎవరైనా కలుసుకోవాలంటే 'ఫలానా టైంకి సైకిల్ షాపుదగ్గరకు రా..' అని మాట్లాడుకునేవారు. పల్లెల నుంచి గుత్తికి ఎవరైనా వచ్చినా తెలిసిపోయేది. ఒకరకంగా సైకిల్ షాపు సమాచార కేంద్రంగా ఉండేది అనుకో..! నేను ఇప్పటికీ సైకిల్ తొక్కుతాను. ఎక్కడికి వెళ్లాలన్నా సైకిల్ మీదనే వెళతాను. గాంధీ చౌక్‌లో సైకిల్ షాప్ నిర్వహిస్తున్నాను.

- మహబుబ్‌బాషా, గుత్తి

నాన్న డెత్ సర్టిఫికెట్ కోసం..

'నాకు పదిహేనేళ్ల వయసు ఉన్నప్పుడు మా నాన్న చనిపోయారు. 1975లో మా నాన్న డెత్ సర్టిఫికెట్ కోసం రాయలచెరువు నుంచి తాడిపత్రికి 30 కి.మీ. సైకిల్‌పై వెళ్లేవాడిని. ప్రభుత్వ కార్యాలయంలో పని అంత తొందరగా జరగదు కదా..? నేను నాలుగుసార్లు తాడిపత్రికి సైకిల్‌పై వెళ్లాను. అంతదూరం సైకిల్‌పై తిరుగుతున్నానని తెలుసుకుని అప్పటి అధికారి వెంటనే మా నాన్న డెత్ సర్టిఫికెట్ తయారు చేయించి ఇచ్చారు. ఆ సంఘటనను ఎన్నటికీ మరిచిపోలేను..'

ఇదీ.. యాడికి మండలం రాయలచెరువుకు చెందిన హాజీవలి జ్ఞాపకం. బరువెక్కిన హృదయంతో తన తండ్రిని తలచుకున్నారు. హాజీవలి వయసు 64 ఏళ్లు. రాయలచెరువులో కూల్‌డ్రింక్ షాప్ నిర్వహిస్తున్నారు. 49 ఏళ్ల నుంచి సైకిలే ఆయన వాహనం. ఇంకో చారిత్రక సంఘటనకూ ఆయన.. ఆయన సైకిల్ సాక్షులు. 'యాడికి కాలువ శంకుస్థాపనకు ఎన్టీరామారావు వచ్చారు. ఆయన్ను చూసేందుకు రెండు కిలోమీటర్లు సైకిల్‌పై వెళ్లాను. ఎన్టీఆర్‌ను కళ్లారా చూశాను. చాలా సంతోషం కలిగింది..' అని గుర్తు చేసుకున్నారు. రాయలచెరువులో ఆయన ఎక్కడున్నా.. పక్కన సైకిల్ తప్పకుండా కనిపిస్తుంది.




హాజీవలి


సైకిల్ ఇమేజ్ పెంచిన అన్న

బుల్లెట్ ఉన్నట్లే..



అప్పట్లో ఊరికి ఒకటో రెండో సైకిళ్లు ఉంటే గొప్ప..! సైకిల్ ఉందంటే బుల్లెట్ బండి ఉన్నట్లు చూసేటోళ్లు. ఇంట్లో సైకిల్ ఉందంటే ఆ ఆనందమే వేరు. అత్యవసరమైతే తెలిసినవాళ్ల సైకిల్ అడిగి తీసుకువెళ్లేవారు. నా వయసు 78 ఏళ్లు. చాలా సంవత్సరాల నుంచి సైకిల్ వాడుతున్నాను. ఎక్కువగా గుత్తికి సైకిల్‌మీద వెళ్లేవాడిని. బంధువుల ఊళ్లకు వెళ్లాలంటే సైకిలే ఆధారం. పొలాలకు వెళ్లేందుకు, పశువులకు గడ్డి మోపులు తెచ్చేందుకు సైకిల్ బాగా ఉపయోగపడేది.

- సుంకన్న, కొత్తపేట, గుత్తి మండలం



రెండొందల ఏళ్ల క్రితం..

జర్మనీకి చెందిన కార్ల్ వాన్ డ్రైస్ సైకిల్‌ను అభివృద్ధి చేశారు. కానీ దాని పేరు సైకిల్ కాదు. 'స్విఫ్ట్ వాకర్' పేరిట 1817లో సైకిల్‌ను రోడ్డుపైకి తెచ్చారు. దానికి పెడల్స్ లేవు. ఇనుప ఫ్రేమ్ కాకుండా.. చెక్కతో తయారు చేశారు. ఇనుప అంచులకు తోలు టైర్లను అమర్చారు. ఆ తరువాత రకరకాల మార్పులతో సైకిల్‌కు ఇప్పటి సైకిల్ రూపం వచ్చింది. మనదేశంలోకి బ్రిటీష్‌వారు సైకిల్‌ను తీసుకొచ్చారట. వలసవాదుల కారణంగా మనకు పరిచయమైన వాహనం.. సైకిల్..! ఇది ఒకప్పు స్టేటస్ సింబల్..! ఊరికి ఒకటి రెండు సైకిళ్లకు మించి ఉండేవి కాదు.

ఆప్తమిత్రుడు..

సైకిల్.. ఓ సంబరం. సైకిల్ ఓ నేస్తం.. ఓ వైద్యుడు.. ఆప్తుడు..! అప్పుడు.. ఇప్పుడు.. ఎప్పుడూ.. అంతే! అత్యవసర సమయంలో ఎంతదూరమైనా, ఎలాంటి దారిలోనైనా సైకిల్‌పై ప్రయాణించగలం. ఆరోగ్య పరిరక్షణకు సైకిల్ తొక్కాలని వైద్యులు కూడా సూచిస్తుంటారు. తన రూపం, రంగులు రకరకాలుగా మారాయేగాని.. తను అందించే ప్రయోజనాలు మాత్రం తగ్గిందే లేదు. బిడ్డ పుట్టిన కొన్నాళ్లకు 'వాకర్' కొనిస్తారు. కాస్త నడక రాగానే సపోర్టింగ్ వీల్స్ ఉండే సైకిల్ కొనిస్తారు. ఆ తరువాత ప్రతి పుట్టిన రోజుకూ కొత్త సైకిల్ కొనాల్సిందే. దానిమీద ఇంటి చుట్టూ, వీధుల్లో.. గ్రౌండ్‌లో రౌండ్స్ వేయాల్సిందే. కాస్త దగ్గరలో ఉన్న బడికి వెళ్లేందుకూ భయం భయంగా సైకిల్‌ను కొనిస్తారు తల్లిదండ్రులు. కొడుకైనా.. కూతురైనా.. వారికి ఇచ్చే తొలి అపూర్వ కానుక ఇప్పటికీ సైకిలే..!

భలే తమాషా..

ఎనభయ్యో దశకంలో సైకిల్ తొక్కడం నేరుగా మొదలయ్యేది కాదు. ఇప్పటిలాగా వయసుకు తగినంత, అనువైన సైకిళ్లు అప్పుడు లేవు. ఉన్నవన్నీ పెద్ద సైకిళ్లే..! దాన్ని ముట్టుకోవాలన్నా ఇంట్లో పెద్దల అనుమతి ఉండాల్సిందే. మొదట సైకిల్‌ను తోయడం.. ఆ తరువాత పడుతూ.. లేస్తూ అర్ధ పెడల్ తొక్కడంతో కథ మొదలయ్యేది. సీటుమీద కూర్చుని సైకిల్ తొక్కాలంటే పిల్లలకు కాళ్లు అందేవి కాదు. ఇది నేర్చుకోగానే 'బార్' తొక్కేవారు. బార్ వచ్చిందంటే ఇంక సైకిల్ తొక్కడంలో పాలేగాడు అయినట్లే..! సైకిల్ తొక్కడం నేర్చుకునేలోగా కిందపడి మోకాళ్లు దొర్లుపొయ్యేవి.

ఉష్ణోగ్రతలు
గరిష్ఠం కనిష్ఠం 37.0 25.0

రేపే కౌంటింగ్

జేఎన్‌టీయూలోని కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు...



- పార్లమెంటు, అసెంబ్లీల వారీగా ఏర్పాట్లు
- ప్రత్యేకంగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు
- జిల్లాకు చేరుకున్న పరిశీలకులు
- భద్రతావలయంలో జేఎన్‌టీయూ

అనంతపురం టౌన్, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. జిల్లాలో అనంతపురం పార్లమెంటుతో పాటు రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, అనంతపురం(అర్బన్), కళ్యాణదుర్గం, రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల కౌంటింగ్ మంగళవారం చేపడుతున్నారు. జిల్లా యంత్రాంగం ఈ కౌంటింగ్ ప్రక్రియకు జేఎన్‌టీయూలో ఏర్పాట్లు పూర్తి చేసింది. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ గత కొన్ని రోజులుగా కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లపై ప్రత్యేక చర్యలు తీసుకుంటూ, అధికారులకు ఆదేశాలిస్తూ వస్తున్నారు. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రత్యేకంగా గదులు ఏర్పాటు చేసి కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఈవీఎంలతో పాటు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ప్రత్యేక గదితో పాటు ప్రత్యేక అధికారులు, సిబ్బందిని ఏర్పాటు చేసి కౌంటింగ్ చేయించనున్నారు.

జిల్లాకు చేరుకున్న పరిశీలకులు...

కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించడానికి కేంద్ర ఎన్నికల కమిషన్ జిల్లాకు ఐఏఎస్ అధికారులను నియమించింది. అనంతపురం, రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గాలకు పరిశీలకులుగా మనీష్ సింగ్, ఉరవకొండ, కళ్యాణదుర్గం, శింగనమల అసెంబ్లీ నియోజకవర్గాలకు పరిశీలకులుగా అజయ్‌నాథ్, తాడిపత్రి, రాయదుర్గం, గుంతకల్లు అసెంబ్లీ నియోజకవర్గాలకు అజయ్‌కుమార్‌లను నియమించారు. వీరు ఆదివారం జిల్లాకు చేరుకున్నారు.

భద్రతావలయంలో జేఎన్‌టీయూ...

కౌంటింగ్ నిర్వహిస్తున్న జేఎన్‌టీయూ ప్రాంతం పూర్తిగా భద్రతా వలయంలో ఉంది. కౌంటింగ్‌కు ఒకరోజు మాత్రమే ఉండటంతో ఆ ప్రాంతాన్ని స్పెషల్ పార్టీ పోలీస్ బృందాలు ప్రత్యేక నిఘాతో పరిశీలిస్తున్నాయి. జిల్లా ఎస్పీ గౌతమీశాలి రాజీ లేకుండా భద్రతా చర్యలపై పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు.


జేఎన్‌టీయూలో కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్


కౌంటింగ్ కేంద్రంలో భద్రతా చర్యలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ గౌతమిశాలి

నియోజకవర్గాల కౌంటింగ్ ఇక్కడే...

రాయదుర్గం నియోజకవర్గం కౌంటింగ్ మెయిన్ బిల్డింగ్ (ఫస్ట్ ఫ్లోర్)లో జరగనుంది. ఉరవకొండ కౌంటింగ్ అడ్మినిస్ట్రేటివ్ భవనం(గ్రౌండ్ ఫ్లోర్), గుంతకల్లు కౌంటింగ్ మెయిన్ బిల్డింగ్ సౌత్‌వింగ్ (ఫస్ట్ ఫ్లోర్), తాడిపత్రి కౌంటింగ్ మెయిన్ బిల్డింగ్ సౌత్‌వింగ్ (గ్రౌండ్ ఫ్లోర్), శింగనమల కౌంటింగ్ ఓల్డ్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ (ఫస్ట్ ఫ్లోర్), అనంతపురం అర్బన్ కౌంటింగ్ ఈసీఈ డిపార్ట్‌మెంట్ (గ్రౌండ్ ఫ్లోర్), కళ్యాణదుర్గం కౌంటింగ్ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ (ఫస్ట్ ఫ్లోర్), రాప్తాడు నియోజకవర్గం కౌంటింగ్ ఈసీఈ డిపార్ట్‌మెంట్ నార్త్‌సైడ్ (ఫస్ట్‌ఫ్లోర్)లలో నిర్వహించడానికి యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది.

అసెంబ్లీల వారీగా కౌంటింగ్ ఇలా...

నియోజకవర్గం	పోలైన ఓట్లు	కౌంటింగ్‌కు టేబుల్స్	ఫలితం రౌండ్లు
రాయదుర్గం	2,27,189	14	22
ఉరవకొండ	1,92,441	18	15
గుంతకల్లు	2,03,820	14	20
తాడిపత్రి	2,06,701	14	20
శింగనమల	2,05,642	14	21
అనంతపురం(అర్బన్)	1,83,019	14	21
కళ్యాణదుర్గం	2,04,297	14	19
రాప్తాడు	2,13,207	14	21

పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఇలా....

నియోజకవర్గం	పోలైన పోస్టల్ బ్యాలెట్లు	కౌంటింగ్‌కు టేబుల్స్	ఫలితం రౌండ్లు
రాయదుర్గం	1671	04	01
ఉరవకొండ	2544	04	02
గుంతకల్లు	3612	04	02
తాడిపత్రి	2702	06	01
శింగనమల	2450	04	02
అనంతపురం(అర్బన్)	6971	04	04
కళ్యాణదుర్గం	2614	04	02
రాప్తాడు	2614	04	03

పొరపాట్లు చేయకండి

కచ్చితమైన ఫలితాలు ప్రకటించాలి
రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఎంకే మీనా


వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఎంకే మీనా, హాజరైన కలెక్టరు తదితరులు

అనంతపురం టౌన్, జూన్ 2: ఎక్కడా ఎలాంటి పొరపాట్లు చేయకుండా, నిబంధనలకు అనుగుణంగా కౌంటింగ్ పక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా అధికారులను ఆదేశించారు. కౌంటింగ్, భద్రతా చర్యలపై తీసుకున్న చర్యలు గురించి ఆదివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ హాల్‌లో ఏచిన్న గొడవ జరగకూడదని, ఎవరైన కావాలని చేస్తే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ఫలితాలు కచ్చితమైన సమాచారంతో ప్రకటించాలన్నారు. రౌండ్ల వారీగా ఫలితాల సమాచారాన్ని ఎప్పటికపుడు యాప్‌లో నమోదు చేయాలన్నారు. కౌంటింగ్ ముగిసిన తర్వాత కూడా సమస్యాత్మక ప్రాంతాలలో ప్రత్యేక భద్రత చేపట్టి శాంతి భద్రతలు పరిరక్షించాలని ఆదేశించారు.

సర్వం సిద్ధం చేశాం: కలెక్టరు

జిల్లాలో కౌంటింగ్ నిర్వహణకు జేఎన్‌టీయూలో ఏర్పాట్లు సిద్ధం చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు వినోద్ కుమార్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి వివరించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ అన్ని ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ వైఖోమ్‌నిదియా, నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్, అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, రిటర్నింగ్ ఆఫీసర్లు రాణిసుష్మిత, శ్రీనివాసులురెడ్డి, వసంతబాబు, వెంకటేష్, శిరీషా, వెన్నెలశ్రీను, పలువురు నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఏజెంట్లు నేడే రావాలి

ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఆయా రాజకీయ పార్టీల తరఫున నియమితులైన ఏజెంట్లు సోమవారం రాత్రికే అనంతపురం నగరానికి చేరుకోవాలని కలెక్టరు వినోద్‌కుమార్ తెలిపారు. ఆర్‌ఓలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు ఎక్కడా పెండింగ్‌లేకుండా చూసుకోవాలన్నారు. కౌంటింగ్ సమయంలో సమస్యలు సృష్టించినా, వాయిస్‌పెంచినా అలాంటి ఏజెంట్లను వెంటనే బయటకు పంపించాలన్నారు. ఏజెంట్లు తప్ప నగరంలో బయటి ప్రాంతాల వ్యక్తులు ఉండకూడదన్నారు. లాడ్జీలు, కమ్యూనిటీహాళ్లు, షాదీఖానాలలో ఎవరైన ఉంటే వారి ఐడీ కార్డులను పరిశీలించాలని, ఇతరులు ఉంటే అక్కడ నుంచి పంపించాలని పోలీసులకు సూచించారు. జేఎన్‌టీయూ సమీపంలో ఇళ్లు ఉన్న వారికీ ఇప్పటికే నోటీసులు ఇచ్చామని, ఇతరులను ఆరోజు ఇళ్లలో ఉంచుకోరాదన్నారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే వదలొద్దు

బందోబస్తు సిబ్బందికి ఎస్పీ ఆదేశం

అనంతపురం క్రైం, జూన్ 2: చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవాలని చూస్తే ఎవరినీ వదలొద్దని సిబ్బందికి జిల్లా ఎస్పీ గౌతమిశాలి ఆదేశించారు. ఆదివారం సిబ్బందితో ఎస్పీ సెట్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో రాజీపడకూడదన్నారు. కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించడంతో పాటు జిల్లా ప్రశాంతతే ముఖ్యమన్నారు. టీం వర్క్‌తో ఎవరికి కేటాయించిన విధులు వారు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. జిల్లా అంతటా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, నలుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడరాదని, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని, అనుమతి లేకుండా ఎవరు ర్యాలీలు, సభలు నిర్వహించరాదని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఓడిన వారి పట్ల కవ్వింపు చర్యలకు పాల్పడటం, హేళన చేయడం, రెచ్చగొట్టడం చేయకుండా చూడాలన్నారు. బాణసంచా నిల్వ ఉంచడం, క్రయ విక్రయాలు చేయడం, కాల్చడం నిషేధమని సూచించాలన్నారు. కౌంటింగ్ అనంతరం అన్ని వర్గాల ప్రజలు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేయాలన్నారు. నియమ నిబంధనలు పాటించాలని, ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా అంతటా 730 కెమెరాలు...

జిల్లా వ్యాప్తంగా నూతనంగా ఏర్పాటు చేసిన 280 సీసీ కెమెరాలతో పాటు ఇదివరకే ఏర్పాటు చేసిన మరో 450 కెమెరాలతో భద్రతను పర్యవేక్షించాలని ఎస్పీ ఆదేశించారు. ఈ కెమెరాలను జిల్లా కేంద్రంలోని ఈ సర్వేలెన్స్ సెంటర్‌కు అనుసంధానించినట్లు తెలిపారు. ఏ చిన్న అవాంఛనీయ ఘటనకు పాల్పడినా, అల్లర్లు, ఘర్షణలకు దిగినా సీసీ ఫుటేజీల్లో దొరికిపోతారన్నారు. కేసులు నమోదైతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాళ్లదాడి కేసులో ఒకరి అరెస్ట్

తాడిపత్రిటౌన్, జూన్ 2: పట్టణంలో రాళ్లదాడి కేసుకు సంబంధించి టీడీపీ అనుబంధ సంస్థ అయిన టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్ నాయుడును ఆదివారం అరెస్ట్ చేసినట్లు సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. అందిన సమాచారం మేరకు పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట సమీపంలో అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు. ఉరవకొండ కోర్టులో హాజరుపరిచి కడప జైలుకు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఏజెంటన్నో..! భద్రం

- బ్రీత్ ఎనలైజర్లతో పోలీసులు సిద్ధం
- మందుకొడితే కౌంటింగ్ కేంద్రంలోకి నో ఎంట్రీ
- కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత
- ఐడీ కార్డు ఉంటేనే అనుమతి
- ఏజెంట్లకు శిక్షణలో ఇరుపార్టీల అభ్యర్థులు నిమగ్నం



అనంతపురం జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లాలో చోటు చేసుకున్న కొన్ని పరిణామాల నేపథ్యంలో కౌంటింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారులు, పోలీసు యంత్రాంగం సిద్ధమైంది. ఆ మేరకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ గౌతమిశాలి పూర్తి స్థాయిలో నిమగ్నమయ్యారు. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘట నలకు తావులేకుండా ముడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి ఎన్నికల అధికారులు జారీ చేసిన ఐడీ కార్డులు, పాస్‌లు ఉన్న వారిని మాత్రమే అనుమతించేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయం లో ఏ ఒక్క అధికారి అలసత్వం వహించినా ఆయా అధికారులపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని ఇప్పటికే కలెక్టర్, ఎస్పీలు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు.

ఏజెంటే కీలకం...

కౌంటింగ్ ప్రక్రియలో ఏజెంట్లే కీలకం. ఈ నేపథ్యంలో అటు కూటమి, ఇటు అధికార వైసీపీ అభ్యర్థులు కౌంటింగ్ కేంద్రాల్లో అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు పార్టీకి విధేయులుగా ఉన్న వారిని ఇప్పటికే కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించారు. ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్, ఎస్పీలు కౌంటింగ్ కేంద్రాల్లో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు వారి వారి ఏజెంట్లకు మూడు రోజులుగా శిక్షణనిచ్చే పనిలో నిమగ్నమయ్యారు. ఆదివారం సైతం ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు ఏజెంట్లకు శిక్షణనిచ్చే పనిలోనే ఉన్నారు. ఎక్కడా ఏమరుపాటుకు తావులేకుండా... చర్చలకు తావివ్వకుండా జాగ్రత్తగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకతను ఆయా పార్టీల అభ్యర్థులు వారి వారి ఏజెంట్లకు వివరించడం గమనార్హం.



జేఎన్‌టీయూలో కౌటింగ్‌కు సిద్ధం చేసిన హాలు

మద్యం తాగితే బయటికే..!

జిల్లాలోని 8 నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రక్రియను జేఎన్‌టీయూలో నిర్వహించనున్నారు. ఏజెంట్ పాస్ ఉంటే కౌంటింగ్ కేంద్రాల్లోకి గతంలో నేరుగా అనుమతించేవారు. అయితే ఈ సారి క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే కౌంటింగ్ కేంద్రాల్లోకి ఏజెంట్లను పంపాలనే స్పష్టమైన నిర్ణయానికి వచ్చారు. ముఖ్యంగా ఎవరైనా మద్యం తాగి కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్లుగా వెళ్లేందుకు ప్రయత్నిస్తే బయటకు పంపనున్నారు. ఇందుకోసం కౌంటింగ్ కేంద్రాల ప్రధాన ద్వారం వద్ద బ్రీత్ ఎనలైజర్లతో పోలీసులను నియమించారు. వారు పరీక్షలు చేసిన తర్వాతనే ఏజెంట్లను లోనికిఅనుమతిం చేలా ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడే ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులకు భయం పట్టుకుంది. మంగళవారం ఉదయం ఉదయం 6 గంటలకే ఆయా పోలింగ్ ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంది. ఎవరైనా సోమవారం రాత్రి మద్యం తాగిఉంటే... ఆ ప్రభావం 12 గంటలపాటు ఉంటుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈ విషయంలోనే ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు తర్జనభర్జన పడుతున్నారు. ఆ మేరకు ఏజెంట్లకు దిశానిర్దేశం చేస్తున్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించిన కేంద్ర బృందం

అనంతపురం టౌన్, జూన్ 2: జిల్లాలో కౌంటింగ్ ఏర్పాట్లను కేంద్ర పరిశీలకులు పరిశీలించారు. ఆదివారం పరిశీలకులు మనీష్‌సింగ్, అజయ్‌నాథ్, అజయ్‌కుమార్ జిల్లాకు చేరుకున్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ గౌతమిశాలితో కౌంటింగ్ ఏర్పాట్లపై ఆరాతీశారు. అనంతరం జేఎన్‌టీయూకు వెళ్లి ఏర్పాట్లు, భద్రతా చర్యలను పరిశీలించారు, అక్కడనుంచి కలెక్టరేట్‌కు చేరుకొని కమాన్ కంట్రోల్‌రూంను పరిశీలించారు. ఆ తర్వాత ఎన్‌ఐసీ సెంటర్‌కు వెళ్లి వారి సమక్షంలోనే ఎన్నికల కౌంటింగ్‌కు నియమించిన 1376మంది సిబ్బందికి ర్యాండమైజేషన్ చేపట్టి డ్యూటీలు కేటాయించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ నిదియా, అసిస్టెంట్ కలెక్టరు వినూత్న తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ నిర్వహిస్తున్న కేంద్ర పరిశీలకులు

జేఎన్‌టీయూ పరిసరాల్లో ట్రాఫిక్ మళ్లింపు



అనంతపురం క్రైం, జూన్ 2: కౌంటింగ్ నేపథ్యంలో సోమ, మంగళవారాల్లో జేఎన్‌టీయూ పరిసరాల్లో ట్రాఫిక్ మళ్లించామని ఎస్పీ గౌతమిశాలి అన్నారు. సూచించిన ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వివరాలను వెల్లడించారు.

- థామస్‌మన్రో సర్కిల్ నుంచి జేఎన్‌టీయూ రోడ్డుకు ఎడమవైపున్న ఫెర్రర్‌నగర్ 9వ క్రాస్‌లో నివశిస్తున్న వారు, శారదానగర్ 6 క్రాస్‌లు, ఎల్‌ఐసీ కాలనీ 4 క్రాస్‌లు, కె.మల్లప్ప కాలనీ 2 క్రాస్‌లు, విద్యానగర్ 2 క్రాస్‌లలో నివశిస్తున్న ప్రజలు, సుశీల్ రెడ్డి కాలనీవాసుల వారి వాహనాల రాకపోకలు జేఎన్‌టీయూ రోడ్డు వైపునకు అనుమతి లేనందున ప్రత్యామ్నాయ మార్గమైన అనంతపురం-కదిరి రోడ్డు మీదుగా నగరంలోకి వెళ్లాలి.
- థామస్ మన్రో సర్కిల్ నుంచి హిందూస్మశాన వాటిక దాటిన తరువాత జేఎన్‌టీయూ వరకు రోడ్డుకు కుడివైపున ఉన్న ఎస్‌బీఐ కాలనీలోని 3 క్రాస్‌ల వారు రాకపోకలు ప్రత్యామ్నాయ మార్గమైన హౌసింగ్‌బోర్డు నుంచి ఆర్టీఓ ఆఫీస్‌కు వెళ్లేలా రోడ్డు మీదుగా నగరంలోకి వెళ్లాలి.
- హౌసింగ్‌బోర్డు 80 ఫీట్ రోడ్డు, పరిసర ప్రాంతాల ప్రజలు కూడా వారి రాకపోకలు విద్యుత్‌నగర్, అశోక్‌నగర్ మీదుగా కొనసాగించాలి.
- రాప్తాడు, ప్రసన్నాయపల్లి, ఇందిరమ్మకాలనీ, చిన్మయనగర్‌కు చెందిన ప్రజలు రాకపోకలు జేఎన్టీయూ వైపు వచ్చేందుకు అనుమతి లేనందున అనంతపురం-కదిరి రోడ్డు మీదుగాగాని లేదా ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ నుంచి నాయక్‌నగర్ మీదుగా నగరంలోకి వెళ్లాలి.
- భైరవ్‌నగర్ 2వక్రాస్ నుంచి 17వ క్రాస్ వరకు ఉన్నవారు భైరవనగర్ 9వరోడ్డు మార్గం ద్వారా ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ నుంచి నాయక్‌నగర్ వైపు వెళ్లే రోడ్డు ద్వారా నగరంలోకి వెళ్లాలి.
- రాప్తాడు, ప్రసన్నాయపల్లి ప్రజలు అనంతపురం-కదిరి రోడ్డు లేదా ప్రసన్నాయపల్లి రైల్వేగేట్ నుంచి నాయక్‌నగర్ మీదుగా వెళ్లాలి.

వాహనాల పార్కింగ్ ఇలా..

అనంతపురం పార్లమెంటు, జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు, ఏజెంట్లకు సంబంధించిన వాహనాల పార్కింగ్ కోసం ఎస్పీ పలు సూచనలు చేశారు.

- రాప్తాడు, అనంతపురం నియోజకవర్గాల వారీగా పోటీ చేసిన అభ్యర్థులు మాత్రమే మొదటి గేట్(సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సర్కిల్‌లోని గేట్)ద్వారా లోపలికి వెళ్లటానికి అనుమతి ఉంటుంది. వారి వాహనాలను జేఎన్‌టీయూ ఆడిటోరియం పక్కనున్న స్థలంలో పార్కింగ్ చేసుకోవాలి.
- తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం నియోజకవర్గాల వారీగా పోటీ చేసిన అభ్యర్థులు మూడో గేట్(మెయిన్ గేట్)ద్వారా లోపలికి వెళ్లటానికి అనుమతి ఉంటుంది. వారి వాహనాలను జేఎన్‌టీయూ మెయిన్ బిల్డింగ్ ముందున్న ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసుకోవాలి.
- అనంతపురం పార్లమెంటు, జిల్లాలోని రాప్తాడు, అనంతపురం, శింగనమల, కళ్యాణదుర్గం, ఉరవకొండ, తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం నియోజకవర్గాల నుంచి పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు వారి వాహనాలను జేఎన్‌టీయూ ప్రాంగణం దాటిన తరువాత పక్కనే ఉన్న పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్‌లో పార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లో వారి వాహనాలకు జేఎన్‌టీయూ కళాశాల లోపలికి వెళ్లేందుకు అనుమతి లేదు.

ఏమవుతుందో ఏమో ..!

- తాడిపత్రి ఫలితంపై ఉత్కంఠ
- అవాంఛనీయ ఘటనలతో ఆందోళన
- గెలుపు ఎవరిదైనా అల్లర్లు తప్పవా?
- రేపు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

తాడిపత్రిటౌన్, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల ఓట్ల కౌంటింగ్ సమయం దగ్గర పడుతుండటంతో తాడిపత్రి నియోజకవర్గంలో ఉత్కంఠ పెరిగిపోతోంది. పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యం మంగళవారం తేలనుంది. ఈ నేపథ్యంలో ఏమైనా గొడవలు జరుగుతాయేమోననే ఆందోళన నియోజకవర్గ ప్రజల్లో వ్యక్తం అవుతోంది. పోలింగ్ సందర్భంగా దాడులు, ప్రతిదాడులు జరగడంతో ఒకింత ఆందోళనకర పరిస్థితులు నియోజకవర్గంలో నెలకొన్న విషయం విదితమే. ప్రధాన పార్టీల అభ్యర్థులు నువ్వా, నేనా అన్నట్లు పోటీ పడటంతో ఇక్కడి ఫలితంపై అభ్యర్థులతోపాటు ప్రజల్లో కూడా ఉత్కంఠ నెలకొంది.

సర్వత్రా హైటెన్షన్

రాష్ట్రమంతా తాడిపత్రి ఫలితం వైపే చూస్తోంది. అందుకు ప్రధాన కారణం మూడేళ్ల కిందట జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రమంతా ఫ్యాన్ హవా చూపినా తాడిపత్రిలో మాత్రం సైకిల్ జోరు చూపించింది. దీంతో ప్రస్తుత అసెంబ్లీ ఫలితంపై అభ్యర్థులతోపాటు అందరిలో ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే ఈ ఫలితంపై జోరుగా పందేలు కాసినట్లు సమాచారం.

గొడవలు, అల్లర్లు తప్పవా..?

కొన్నేళ్లుగా ప్రశాంతంగా ఉన్న తాడిపత్రిలో వైసీపీ అల్లరిమూకలు సృష్టించిన దాడుల వల్ల పట్టణ ప్రజలు భీతిల్లారు. ఎన్నికలు జరిగిన మరుసటిరోజే ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ మూకలు టీడీపీ సీనియర్ నాయకుడు సూర్యముని ఇంటిపై రాళ్లదాడి చేశారు. ఈక్రమంలో మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తే పరిస్థితి ఏంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రశాంతత నెలకొల్పితే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఎక్కడ చూసినా పోలీసు బలగాలే..

పోలింగ్ సందర్భంగా జరిగిన గొడవల నేపథ్యంలో పట్టణంలో ఎక్కడచూసినా పోలీసు బలగాలే కనిపిస్తున్నాయి. బందోబస్తుకు దాదాపు 500మంది సిబ్బందిని నియమించారు. వీరిలో ఇద్దరు డీఎస్పీలు, ఏడుగురు సీఐలు, 15 మంది ఎస్ఐలు, 30 మంది ఏఎస్ఐలు, 200మంది సివిల్ పోలీసులు, 100 మంది ర్యాపిడ్‌ఫోర్స్ సిబ్బంది, 100మంది ఏపీఎస్పీ బెటాలియన్ సిబ్బందిఉన్నారు. ఎక్కడ ఏ చిన్న సమస్య తలెత్తినా వెంటనే స్పందించాలని అధికారులు ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. నిర్లక్ష్యంగా ఉండకుండా చురుకుగా పనిచేయాలని పోలీస్‌బాస్ స్థానిక పోలీసులను ఆదేశించినట్లు సమాచారం. అయితే కిందిస్థాయి సిబ్బంది మాత్రం విధుల్లో అలసత్వం వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పలు చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది సమీపంలోని చెట్ల వద్ద కుర్చీలు వేసుకొని నింపాదిగా కూర్చొవడమే కాకుండా సెల్‌ఫోన్లు చూసుకుంటూ కాలక్షేపం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

ద్వితీయశ్రేణి నాయకులను గుర్తించి ఉంటే..

గతంలో జరిగిన దాడులు, ఘర్షణలను దృష్టిలో ఉంచుకొని అజ్ఞాతంలో ఉన్న ఇరుపార్టీలకు చెందిన ద్వితీయశ్రేణి నాయకులను గుర్తించి ఉంటే బాగుండేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. రాళ్లదాడులు జరిగి 20రోజులు కావస్తున్నా పోలీసు అధికారులు ఈ దిశగా ఎందుకు దృష్టి సారించడం లేదో అంతుచిక్కని ప్రశ్నగా మారింది. ఏ పార్టీ గెలిచినా ఆ పార్టీకి చెందిన ద్వితీయశ్రేణి నాయకులు పట్టణానికి వస్తే ఆ రోజు పరిస్థితులు ఎలా ఉంటాయోనని ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వీరిని అదుపులోకి తీసుకొని ఉంటే పరిస్థితి చేయిదాటకుండా ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పెరుగుతున్న బైండోవర్, రౌడీషీట్లు

కేవలం జిల్లా ఉన్నతాధికారులకు చూపించడానికి అమాయకులను బలిపశువులను చేసి బైండోవర్, రౌడీషీట్‌లు ఓపెన్ చేస్తున్నట్లు పోలీసులపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దాడులతో సంబంధం లేనివారిని సైతం వరుసపెట్టి బైండోవర్‌లు చేస్తుండటంతో నియోజకవర్గ ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఈక్రమంలో వారి కుటుంబ సభ్యులు నిత్యం పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద పడిగాపులు కాస్తున్నారు. కనిపించిన అధికారులతో సార్.... మా వాడికి రాళ్లదాడులకు ఎలాంటి సంబంధం లేదు అని మొరపెట్టుకుంటున్నారు. ఇప్పటివరకు నియోజకవర్గ వ్యాప్తంగా 197మందిపై రౌడీషీట్, 200మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. వీరిలో దాడులకు సంబంధంలేని వారే ఎక్కువగా ఉన్నారన్న ప్రచారం ఉంది.



యల్లనూరు రోడ్డులో ఉన్న చెకింగ్ పాయింట్‌లో సెల్‌ఫోన్ చూస్తూ కాలక్షేపం చేస్తున్న కానిస్టేబుల్



జేసీపీఆర్ ఇంటివద్ద సెల్‌ఫోన్లు చూసుకుంటున్న పోలీసు సిబ్బంది

లాడ్జిలు, హోటళ్లలో విస్తృత తనిఖీలు

అనంతపురం క్రైం, జూన్ 2: జిల్లాలో మంగళవారం జరగనున్న కౌంటింగ్ నేపథ్యంలో ఎస్పీ గౌతమిశాలి ఆదేశాల మేరకు పోలీసులు లాడ్జిల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. అనుమానితులు, అపరిచితులు లాడ్జిల్లో బస చేసి కౌంటింగ్ ప్రక్రియ రోజు ఎలాంటి ఘటనలకు పాల్పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా తనిఖీలు చేపట్టారు. అనుమానితులకు ఎట్టి పరిస్థితుల్లోను లాడ్జిల్లో గదులు ఇవ్వకూడదని, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు. హోటళ్లలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం సేవించేందుకు అనుమతిస్తే చర్యలు చేపడతామన్నారు.



పెద్దపప్పూరు ఎస్ఐ సస్పెన్షన్

తాడిపత్రిటౌన్, జూన్ 2: పెద్దపప్పూరు మండల ఎస్ఐ శరత్ చంద్రను ఉన్నతాధికారులు ఆదివారం సస్పెండ్ చేశారు. తాడిపత్రి రాళ్లదాడి కేసులో నిందితుడిగా ఉన్న టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్‌నాయుడు పెద్దపప్పూరు మండలంలోని ముచ్చుకోట సమీప ప్రాంతాల్లో ఉన్నప్పటికీ కదలికలను పసిగట్టలేదని డ్యూటీలో అలసత్వం వహించాడన్న కారణంగా ఎస్ఐను సస్పెండ్ చేశారు.

రుతుపవనాలు వచ్చేశాయ్

జిల్లాను తాకిన నైరుతి

అనంతపురం అర్బన్, జూన్ 2: నైరుతి రుతుపవనాలు ఆదివారం సాయంత్రం అనంత జిల్లాను తాకాయి. ఈ ప్రభావంతో జిల్లాలో సోమవారం నుంచి మూడు రోజులపాటు తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షం పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అలాగే ఒకటి, రెండు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది. 30-40 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. గతేడాది జూన్ 8న జిల్లాలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. గతంలో పోలిస్తే... ఆరు రోజుల ముందుగానే జిల్లాలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగానే వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఇదే జరిగితే గత ఏడాదితో పోలిస్తే ఎక్కువ విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యే అవకాశం ఉంది.

20 మండలాల్లో వర్షం

జిల్లాలోని 20 మండలాల్లో శనివారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా ఉరవకొండలో 52.6 మి.మీ వర్షపాతం నమోదైంది. కూడేరు 50.4, బెళుగుప్ప 49.8, రాయదుర్గం 35.6, వజ్రకరూరు 32.2, బొమ్మనహాళ్ 27.2, గుమ్మఘట్ట 25.8, కళ్యాణదుర్గం, కంబదూరు 24.2, ఆత్మకూరు 20.0, బ్రహ్మసముద్రం 18.2, కణేకల్లు 17.0, విడపకల్లు, యాడికి 14.2, యల్లనూరు 12.6 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 8.2 మి.మీలోపు వర్షపాతం నమోదైంది.

శ్రీసత్యసాయి జిల్లాలో..

పుట్టపర్తి రూరల్: అత్యధికంగా కనగానపల్లిలో 54.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. చిలమత్తూరు 51.2, నంబులపూలకుంట 44.2, కొత్తచెరువు 42.2, గోరంట్ల 42.0, పెనుకొండ 40.0, రామగిరి 33.4, పుట్టపర్తి 29.8, కదిరి 27.2, గాండ్లపెంట 26.8, చెన్నేకొత్తపల్లి 22.6, నల్లచెరువు 22.4, అమడగూరు 21.6, బుక్కపట్నం 16.4, ఓబుళదేవరచెరువు 16.2, సోమందేపల్లి 15.4, హిందూపురం 14.8, పరిగి 14.2, నల్లమాడ 13.2, రొళ్ల 10.4, ధర్మవరం, తనకల్లు 9.6, మడకశిర 9.2, గుడిబండ 8.8, లేపాక్షి 8.2, రొద్దం 7.6 మిమీ, అమరాపురం 6.2 మిమీ, తాడిమర్రి 5.8, బత్తలపల్లి 3.4, అగళి 3.0, తలుపులలో 2.8 మి.మీ వర్షపాతం నమోదైందన్నారు.

పడిపోయిన విద్యుత్ స్తంభాలు

అనంతపురంరూరల్: ఈదురుగాలుల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. శనివారం రాత్రి వీచిన ఈదురుగాలకు కూడేరు, శింగనమల, చెన్నేకొత్తపల్లి ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. ఆయా ప్రాంతాల్లో 15విద్యుత్ స్తంభాలు పడిపోయినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర తెలిపారు. దీంతో స్వల్ప నష్టం జరిగినట్లు వెల్లడించారు. ఇబ్బందులు తలెత్తిన ప్రాంతాల్లో లైన్లను మరమ్మతులు చేసి.. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు.

దెబ్బతిన్న పత్తి, మొక్కజొన్న పంటలు

బొమ్మనహాళ్: మండలంలో శనివారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అక్కడక్కడ మొక్కజొన్న, పత్తి పంటలు వర్షపునీటికి తడిసిపోయాయి. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షం కురవడం వల్ల వరద నీరు ఉద్దేహాళ్ హగరికి భారీగా వచ్చి చేరింది. కొళగానహళ్లి, కబాలివంకలు ఉధృతంగా ప్రవహించాయి. మండలంలో దేవగిరి, ఉద్దేహాళ్, శ్రీధరఘట్ట తదితర గ్రామాలలో భారీ వర్షం పడింది. 27.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.



బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ సమీపాన నీట మునిగిన పత్తిపంట



బొమ్మనహాళ్ మండలం లింగదహాళ్ వద్ద వర్షపునీటిలో మొక్కజొన్న పైరు

అనర్హులకు ఇన్‌-చార్జి బాధ్యతలు

సమగ్రశిక్షలో అసిస్టెంట్ సెక్టోరియల్‌కు జీసీడీఓ బాధ్యతలు

నిబంధనలు గాలికి.. ఏపీసీ చర్యలు తీసుకునేరా...?

అనంతపురం విద్య, జూన్ 2: సమగ్రశిక్ష ప్రాజెక్టులో అనర్హులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అడ్మిషన్ల వేళ సెక్టోరియల్ కేడర్‌కు చెందిన అత్యంత కీలకమైన జీసీడీఓ పోస్టు అసిస్టెంట్ సెక్టోరియల్‌కు ఇన్‌చార్జిగా అప్పగించడంపై అనేక విమర్శలు వస్తున్నాయి. ఇప్పటి వరకు జీసీడీఓగా పనిచేస్తున్న మహేశ్వరి ఇటీవల చైల్డ్ కేర్ లీవ్ తీసుకున్నారు. గతనెల 30వ తేదీ నుంచి 13వ తేదీ వరకు సెలవుపై వెళ్లినట్లు సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారులు స్పష్టం చేశారు. అసిస్టెంట్ ఐఈడీగా పనిచేస్తున్న షమకు ఇన్‌చార్జి జీసీడీఓ బాధ్యతలు అప్పగించారు. కేజీబీవీల్లో వేలాది మంది విద్యార్థినులు చదువుకుంటుండగా, వందలాది మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 32 కేజీబీవీలను పర్యవేక్షించాల్సిన బాధ్యత జీసీడీఓగా పనిచేసే అధికారిదే. అందుకు మండల విద్యాశాఖాధికారి, ప్రధానోపాధ్యాయులు మాత్రమే అర్హులు. అసిస్టెంట్ ఐఈడీగా పనిచేస్తున్న షమా గతంలో పీజీటీగా పనిచేశారు. పీజీటీ పోస్టు స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు సమానం. ఎంఈఓ, హెచ్‌ఎం కాకపోయినా ఆమెకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం శోచనీయం. ఆమె అయిష్టంగా ఉన్నట్టు సమాచారం. జిల్లాలో మహిళా ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు లేరన్నట్టుగా అనర్హులకు అప్పగించడంపై అనేక విమర్శలు వస్తున్నాయి. గతంలో కూడా జీసీడీఓ పోస్టు భర్తీలో సమగ్రశిక్ష అధికారులు అనర్హులకు అవకాశం ఇచ్చారన్న ఆరోపణలు మూటగట్టుకున్నారు. జూన్ నుంచి ఆగస్టు వరకు అడ్మిషన్లు జరుగుతాయి. అత్యంత కీలకమైన సమయంలో అనర్హులకు జీసీడీఓ బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వస్తున్నాయి. కొత్తగా నియమితులైన ఏపీసీ ఈ సమస్యకు ఎలా పరిష్కారం చూపుతారో చూడాలి.

విద్యుదాఘాతంతో రైతు మృతి

గుమ్మఘట్ట, జూన్ 2: మండలంలోని పైదొడ్డి గ్రామంలో ఆదివారం ఉదయం విద్యుదాఘాతంతో రైతు నాయకుల పాలయ్య(49) మృతి చెందాడు. పొలంలో వ్యవసాయ మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లి స్టార్టర్ వద్ద కిందపడి మృతి చెందాడు. కొంత సమయానికి కుటుంబసభ్యులు అక్కడికెళ్లి చూడగా.. మోటార్‌కు అమర్చిన స్టార్టర్‌లో విద్యుత్‌షాక్‌కు గురైనట్లు గుర్తించి రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గుమ్మఘట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.



పాలయ్య (ఫైల్)



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన పయ్యావుల



అనంతపురం అర్బన్: జేఎన్‌టీయూలో ఉరవకొండ నియోజకవర్గం ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూం భద్రతను పీఏసీ చైర్మన్, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పరిశీలించారు. ఆదివారం ఆయన జేఎన్‌టీయూలో సీసీ కెమెరాల ద్వారా స్ట్రాంగ్ రూంల భద్రతను ఆయన పరిశీలించారు.

కౌంటింగ్‌లో అప్రమత్తంగా ఉండాలి

అనంతపురం అర్బన్, జూన్ 2: కౌంటింగ్ ప్రక్రియలో అనుక్షణం ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని కూటమి అనంత అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఒక ప్రకటనలో సూచించారు. మంగళవారం జేఎన్‌టీయూలో జరిగే అనంత అర్బన్ నియోజకవర్గం కౌంటింగ్ ప్రక్రియలో వైసీపీ నాయకులు అరాచకాలు సృష్టించే అవకాశం ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని వాటిని అడ్డుకునేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల నిబంధనలకు లోబడి ఏజెంట్లు వ్యవహరించాలన్నారు. ఏ చిన్న అనుమానం వచ్చినా చీఫ్ ఎన్నికల అధికారి, ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. కౌంటింగ్ చివరి దాకా చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు: కాలవ



వాల్మీకి ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న కాలవ శ్రీనివాసులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 2: విద్యతోనే పేదరికాన్ని జయించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయొచ్చని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. 2023-24 సంవత్సరంలో పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా వాల్మీకి-బోయ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ఆదివారం స్థానిక రామ్‌నగర్ సమీపంలోని వాల్మీకి కళ్యాణ మండపంలో ప్రతిభా పురస్కారాలు ప్రదానోత్సవం నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, టీడీపీ ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణలతో కలిసి ఆ పురస్కారాలు అందజేసిన కాలవ మాట్లాడారు. వాల్మీకి బోయలు విద్యలో ఉన్నత స్థానాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విశ్రాంత డీఎఫ్‌ఓ ఆదినారాయణ, జీసీడీఓ వాణిదేవి, అమరావతి ఆసుపత్రి ఎండీ ముత్యాలప్ప, మాజీ సీఈఓ ఈశ్వరయ్య, ఆనందరామ, వాల్మీకి బోయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అక్కులప్ప, చైతన్యకుమార్, కోశాధికారి పవన్‌కుమార్, నాయకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ పోటీల్లో అనంత జట్టు విజయం


ఛాయాశ్రీ, హిమవర్షిణి

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 2: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-15 బాలికల క్రికెట్ పోటీల్లో జిల్లా జట్టు వరుస విజయాలు అందుకుంది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ అండర్-15 బాలికల క్రికెట్ పోటీలలో భాగంగా ఆదివారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించారు. అనంతపురం, నెల్లూరు జట్లు తలపడగా... మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం నిర్ణీత 20 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 208 పరుగులు చేసింది. ఇందులో హిమవర్షిణి 68 పరుగులు, ఛాయాశ్రీ 71పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన నెల్లూరు జిల్లా 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 49 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. అనంత బౌలర్ చక్రి రెండు రెండు వికెట్లు తీసుకుంది. దీంతో అనంతపురం జట్టు 149 పరుగుల భారీ తేడాతో విజయాన్ని అందుకుంది. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, సభ్యులు, కోచ్‌లు పాల్గొన్నారు.

ఫిడే రేటింగ్‌లో ఉత్తమ ర్యాంకులు


తేజస్వి, హేమచరణ్

ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్‌లో జిల్లా చెస్ క్రీడాకారులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఇటీవల జరిగిన పోటీల్లో ప్రతిభతో జిల్లాకు చెందిన క్రీడాకారులు తేజస్వి 1516 ర్యాంకు, హేమచరణ్ 1426 ర్యాంకులు సాధించారు. ఆ క్రీడాకారులతో పాటు కోచ్ సురేంద్రనాథ్‌ను ఆల్ అనంతపురం అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, ఉదయ్‌కుమార్ నాయుడు అభినందించారు.

పశువుల సంత ఆదాయం రూ.4.63 లక్షలు

అనంతపురంరూరల్, జూన్ 2: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.4,63,350 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.2,06,720, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.2,56,630 ఆదాయం వచ్చిందని తెలిపారు.

క్రీడాభారతి కార్యవర్గం ఎన్నిక


అసోసియేషన్ నూతన కార్యవర్గం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 2: జిల్లా క్రీడాభారతి అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఆదివారం స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ఆవరణంలో సాయంత్రం జిల్లా క్రీడాభారతి అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర క్రీడాభారతి అసోసియేషన్ ప్రతినిధి సురేంద్రరెడ్డి, జిల్లా ఆర్ఎస్ఎస్ సంఘ్ ప్రచారక్ రాఘవేంద్ర సమక్షంలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులుగా ప్రభాకర్, నరసింహారెడ్డి, మంజులదేవి, కార్యదర్శిగా శ్రీనివాసులు, సహాయ కార్యదర్శులుగా గోపాల్‌రెడ్డి, రాగేష్‌బాబు, శ్రీవాణి, కోశాధికారిగా కేశవమూర్తి, కార్యవర్గసభ్యులుగా నాగరాజు, మారుతిప్రసాద్, అంజినేయులు, బయపురెడ్డి, శ్రీదేవి, రాధికను ఎన్నుకున్నారు. రాష్ట్ర క్రీడాభారతి అసోసియేషన్ కార్యవర్గసభ్యులుగా విశ్రాంతి డీఎస్‌డీఓ జీవీ రమణ, సునీతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కనగానపల్లిలో 54.2 మి.మీ వర్షపాతం

ధర్మవరంరూరల్, జూన్ 2: కనగానపల్లి మండలంలో శనివారం రాత్రి కురిసిన వర్షం 54.2 మి.మీ వర్షపాతంగా నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెక్‌డ్యాంలు జలకళను సంతరించుకున్నాయి. ఈదురు గాలులకు చెట్లు నేలకొరిగాయి. వర్షం రాకతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం

అనంతపురం అర్బన్, జూన్ 2 : నైరుతి రుతుపవనాల ప్రవేశం ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. అనంతపురం, బెలుగుప్ప, పెద్దవడుగూరు, గుత్తి, నార్పల, పామిడి, గార్లదిన్నె తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. యాడికి, గుంతకల్లు, పుట్లూరు తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. పామిడి పట్టణంలోని జూనియర్ కళాశాల వద్ద ఈదురుగాలులుకు చెట్లు విద్యుత్ స్తంభంపై పడటంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో అర్ధరాత్రి దాకా ప్రజలు చిమ్మచీకట్లో గడపాల్సి వచ్చింది.

సహాయ నిధికి దరఖాస్తు చేసుకోండి

అనంతపురం కల్చరల్, జూన్ 2: ఏపీఎస్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు ఈనెల 30 లోపు సీసీఎస్ వృద్ధాప్య సహాయ నిధికోసం దరఖాస్తు చేసుకోవాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి రామిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీసీఎస్‌లో కనీసం ఐదు సంవత్సరాల సభ్యత్వం కలిగి ఉండి, 61 సంవత్సరాలు నిండినవారు ఈ సహాయ నిధికి అర్హులన్నారు. అర్హత గల ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు తమ దరఖాస్తులను ' సెక్రటరీ, సీసీఎస్ కార్యాలయం, ఆర్టీసీ హౌస్, పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్, విజయవాడ చిరునామాకు ఈనెల 30 లోపు దరఖాస్తులు పంపాలన్నారు జూలై లేదా ఆగస్టులో విశ్రాంత ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో సీసీఎస్ ఆర్థిక సహాయం జమ అవుతుందన్నారు.

ఆదర్శ పాఠశాలలో మిగిలిన సీట్లకు...

గార్లదిన్నె : ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతుల్లో కొన్ని సీట్లు మిగిలిపోయాయని, వాటి భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సతీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని, వారికి 19న పరీక్ష నిర్వహించి.. ఉత్తీర్ణత ఆధారంగా సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

మందుబాబుల కష్టాలు...!

- కౌంటింగ్ నేపథ్యంలో మళ్లీ ఫోన్ పే ఆంక్షలు
- టార్గెట్ పూర్తి కావడంతో మధ్యాహ్నానికే పలు షాపుల బంద్
- నేటి నుంచి షాపుల బంద్‌తో క్యూకట్టిన మద్యం ప్రియులు
- జే బ్రాండ్లను అంటగడుతున్న సిబ్బంది


కమలానగర్‌లో మద్యం షాపు వద్ద క్యూ


బళ్లారి బైపాస్‌లోని మద్యం షాపు వద్ద రద్దీ

అనంతపురం అర్బన్, జూన్ 2: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో రెండు రోజుల నుంచి మళ్లీ మద్యం విక్రయాలకు ఫోన్‌పే ఆంక్షలు పెట్టారు. కేవలం డిజిటల్ లావాదేలను అనుమతిస్తుండటంతో మద్యం ప్రియులు నానా తంటాలు పడాల్సి వచ్చింది. మద్యం దుకాణాల వద్ద ఫోన్ పే చేసి మద్యం తీసుకువెళ్లే వారిని బతిమలాడి వారికి నగదు అందజేసి వారితో ఫోన్ పే ద్వారా డబ్బులు వేయించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోతోంది. దీంతో చేసిందేమి లేక నిరాశతో వెనుతిరగాల్సిన పరిస్థితిని అనేక మంది మద్యం ప్రియులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కేవలం జే బ్రాండ్లను మాత్రమే అందుబాటులో ఉంచారు. మిగతా బ్రాండ్లను కొందరు షాపుల్లో పనిచేసే సిబ్బంది తమకు తెలిసిన వారికి, రాజకీయ నాయకులకు గుట్టుచప్పుడు కాకుండా అందజేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా... వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మద్యం షాపుల్లో కేవలం నగదు లావాదేవీలు జరిపారు. సాధారణ టీకొట్టు, తోపుడు బండ్లల్లోనూ ఫోన్ పే అవకాశం ఉండగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఎందుకు డిజిటల్ లావాదేవీలు జరపలేదని ప్రతిపక్షాలు అనేక సార్లు గొంతెత్తినా పట్టించుకోలేదు. తీరా పోలింగ్‌కు ఐదు రోజుల ముందు కేవలం ఫోన్‌పే ద్వారానే డబ్బులు చెల్లించాలని షరతు పెట్టారు. పోలింగ్ అనంతరం తిరిగి నగదును అనుమతించారు. ప్రస్తుతం ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో రెండు రోజులుగా కేవలం ఫోన్‌పే ఆంక్షలు అమలు చేయడంపై మద్యం ప్రియులు మండిపడుతున్నారు. ఫోన్‌పేతో పాటు నగదు లావాదేవీలకు ఎందుకు అనుతించకూడదని నిలదీస్తున్నారు. ఐదేళ్లు డిజిటల్ లావాదేవీలు చేయకుండా ఎన్నికల సమయంలో ఈ గోలేంటని నిట్టూరుస్తున్నారు.


కమలానగర్‌లోని మద్యం షాపు మూసేయడంతో నిరాశగా మందుబాబులు

క్యూకట్టిన మద్యం ప్రియులు : ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో తాడిపత్రి నియోజకవర్గంలో సోమ, మంగళ, బుధవారాల్లో ప్రభుత్వ మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లను బంద్ చేయనుంది. తాడిపత్రి నియోజకవర్గంలో పోలింగ్ రోజు అల్లర్లను దృష్టిలో ఉంచుకొని మద్యం షాపులు బంద్ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్ నిర్ణయించారు. జిల్లాలోని మిగతా నియోజకవర్గాల్లో ఈనెల 3వతేదీ సాయంత్రం 5 గంటల నుంచి 4వతేదీ దాకా మద్యం షాపులు బంద్ చేస్తారు. కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకొని మద్యం షాపులు బంద్ చేస్తు న్నారన్న సమాచారంతో మద్యం ప్రియులు ముంద స్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం మద్యం షాపుల వద్ద మద్యం ప్రియులు క్యూ కట్టారు. తీరా అక్కడికి వెళ్లిన తర్వాత కేవలం ఫోన్ పే ద్వారానే డబ్బులు స్వీకరిస్తామని, నగదు తీసుకోమని చెప్పడంతో ఇదెక్కడి అన్యాయమంటూ సిబ్బందితో మద్యం ప్రియులు వాగ్వాదానికి దిగినా ఎలాంటి ఫలితం లేకపోయింది. దీంతో కొందరు తమకు తెలిసిన వారితో ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లించి మద్యం కొనుగోలు చేసుకున్నారు. మరికొందరు నిరాశతో వెనుతిరిగి వెళ్లాల్సి వచ్చింది.

వైసీపీపై పోరాటం మరువలేనిది

మాజీ మంత్రి పరిటాల సునీత
మహిళా నేతలకు సన్మానం


మహిళా నేతలతో పరిటాల సునీత

అనంతపురం అర్బన్, జూన్ 2: వైసీపీ అరాచక పాలనపై రాప్తాడు నియోజకవర్గం మహిళా నేతల పోరాటం మరువలేనిదని మాజీ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో రాప్తాడు నియోజకవర్గం టీడీపీ మహిళా నేతలతో ఆమె సమావేశమయ్యారు. ముందుగా ధర్మవరం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ సతీమణి పరిటాల జ్ఞాన చేతుల మీదుగా మహిళా నేతలకు పసుపు, కుంకుమలు అందజేసి ఘనంగా సన్మానించారు. వైసీపీ ప్రభుత్వం అరాచకాలు, వైఫల్యా లతో పాటు చంద్రబాబు సీఎం అయితే కలిగే ప్రయోజ నాలను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో మహిళా నేతలు విశేషంగా కృషి చేశారని కొనియాడారు. టీడీపీ మెనిఫెస్టోను ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించి వారిలో చైతన్యం నింపారన్నారు. పురుషులతో సమానంగా రాప్తాడు నియోజకవర్గంలో టీడీపీకి భారీ మెజార్టీ వచ్చేలా కష్టపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నేతలతో పాటు మండల కన్వీనర్లు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి సరుకులు అందజేత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న యువత

అనంతపురం క్లాక్‌టవర్ : స్థానిక నగరంలోని వృద్ధాశ్రమానికి రూ. 25 వేల విలువైన నిత్యావసర సరుకులను ప్రగతి పథం యూత్ అసోసియేషన్, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో జాతీయ యువ అవార్డు గ్రహీత భరత్, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ సుంకర రఘు, సభ్యులు కిరణ్‌సాయి, రాజు పాల్గొన్నారు.

నిరుపేదకు నిత్యావసరాలు..

అనంతపురం కల్చరల్ : ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేద మహిళకు నిత్యసురభి ట్రస్టు నిత్యావసర సరుకులు అందజేసింది. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న స్థానిక నవయుగ కాలనీలో నివాసముంటున్న సుంకమ నిత్యసురభి ట్రస్టును ఆశ్రయించింది. ఆ ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలా మురళి ఆదివారం సుంకమ్మ నివాసానికి చేరుకుని ఒక బియ్యం ప్యాకెట్, 30 రకాల నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు శ్రీనివాసులు, సౌదామిణి, నవయుగ కాలనీ సెక్రటరీ రాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి


బండి పరశురాం

అనంతపురం విద్య, జూన్ 2: జిల్లాలో కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బండి పరశురాం డిమాండ్ చేశారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... జిల్లాలోని పలు కార్పొరేట్ స్కూ ళ్ల లక్షలాది ఫీజులు గుంజుతూ... విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయన్నారు. టెక్నో, ఒలింపియాడ్, ఐపీఎల్ తదితర పేర్లతో కరువు జిల్లాలో విద్యార్థుల తల్లిదండ్రులను నిలువునా దోచేస్తున్నాయని మండిపడ్డారు. పుస్తకాల పేరుతోనే ఏకంగా రూ.20 వేల వరకూ లాగేస్తున్నారని మండిపడ్డారు. నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా విద్యాసంస్థలు వ్యవహించినా... డీఈఓ, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. ఫీజుల దోపిడీ అరికట్టాలని, లేకుంటే టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష దాడులు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ప్రజాస్వామిక హక్కులపై దాడి ఆపాలి: సీఐటీయూ

అనంతపురం కల్చరల్, జూన్ 2: ఆర్టీసీ ఉద్యోగుల ప్రజాస్వామిక హక్కులపై దాడిని ఆపాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సుందరయ్య అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ అధ్యక్షతన ఆదివారం జేవీవీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పరిధిలో లేని అంశాన్ని ఆధారంగా చేసుకుని ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకుడు సుందరయ్య, ఎన్ఎంయూ నాయకుడు శ్యామ్, బహుజన కార్మిక సంఘం నాయకుడు సుబ్బారావును సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. చిన్న చిన్న కారణాలతో ఆర్టీసీ ఉద్యోగులను సస్పెన్షన్ చేయడం తగదన్నారు. వేధింపులు ఆపకపోతే ఉద్యోగ సంఘాలు ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, ఏపీ కో-ఆపరేటివ్ ఉద్యోగుల సంఘం నాయకుడు శ్రీనివాసులు, మున్సిపల్ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, మెడికల్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనోహర్, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఎన్జీఓ సంఘం నగరాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, సీఐటీయూ నగర కార్యదర్శి వెంకటనారాయణ, ముత్తుజ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఓబులు

పైపులైన్ ధ్వంసం


ధ్వంసం చేసిన దోబీఘాట్‌కు వెళ్లే పైపులైన్



ధర్మవరంరూరల్, జూన్ 2: కనగానపల్లి మండలంలోని మామిళ్లపల్లిలోని దోబీఘాట్‌కు నీటిని సరఫరా చేసే పైపులైన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయంలో మాజీ మంత్రి పరిటాల సునీత రజకుల కోసం గ్రామ శివారులోని తలిపిరి వద్ద రూ.7 లక్షలతో దోబీఘాట్ నిర్మించారు. నీటి వసతి కోసం బోరు వేయించి.. పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. ఆదివారం ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఆ పైపులను ధ్వంసం చేసినట్లు తెలిపారు. దీంతో తాము జీవనాధారం కోల్పోయినట్లు అయిందని రజకులు వాపోతున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రజకులు తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఓట్లు వేయడంతోనే వైసీపీ వర్గీయులు వాటిని ధ్వంసం చేసినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

పైపులైన్ గుంత పూడ్చివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురంరూరల్, జూన్ 2: మండలంలోని అక్కంపల్లి క్రాస్ పీఏబీఆర్ పైపులైన్ నిమిత్తం తవ్విన గుంతను సంబంధిత అధికారులు పూడ్చివేశారు. ఈ క్రాస్‌లోని పైపులైన్ కోసం తవ్విన గుంతను పూడ్చి వేయకుండా వదిలేయడంపై ఆంధ్రజ్యోతి ఓ కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన అధికారులు ఆ గుంతను పూడ్చివేశారు.

అక్కంపల్లి క్రాస్‌లో పూడ్చిన గుంత →



అధ్వానవనాలు

- శిథిలావస్థలో నగరంలోని పార్కులు.. ● అధ్వానంగా నీరు-ప్రగతి పార్కు
- రూ.15 లక్షలతో టెండరు దక్కించుకున్నా సాగని పనులు
- రాజీవ్ చిల్డ్రన్స్ పార్కు మరీ దారుణం.. ● మిగిలిన వాటిలోనూ అదే పరిస్థితి


రామ్‌నగర్ పార్కులో బెంచ్ దుస్థితి


రామ్‌నగర్ పార్కులో ఫీట్లు

అనంతపురం క్రైం : నగరంలో ఉద్యానవనాలు (పార్కులు) అధ్వానవనాలుగా మారాయి. వాకింగ్ ట్రాక్ నుంచి చిన్నపిల్లలు ఆడుకునే జారుడు బల్లల వరకు ప్రమాదకరంగా ఉన్నాయి. నగరం లో అతి పెద్ద పార్కు, రాజీవ్ చిల్డ్రన్స్ పార్కు, పేరున్న నీరు- ప్రగతి పార్కులు సైతం ఏదో ఉన్నాయంటే ఉన్నా యంతే. ప్రత్యేకంగా పార్కుల పర్యవేక్షణకు డీఈ స్థాయి అధికారిని కేటాయిం చినా ఫలితం శూన్యం. వీటి అభివృద్ధికి పేపర్‌పై రూ.కోట్ల నిధులు వెచ్చించినా... అభివృద్ధి మాత్రం శూన్యం.

టెండరొచ్చినా సాగని పనులు

నగరంలోని శ్రీనగర్ కాలనీలో నీరు-ప్రగతి పార్కు మధ్యలో గార్డెనింగ్, వాకింగ్ ట్రాక్, బెంచీలు, పిల్లలు ఆడుకునే పరికరాల ఏర్పాటుకు రూ.15 లక్షలతో టెండరు పిలిచారు. వైసీపీ స్థానిక కార్పొ రేటరే టెండరు దక్కించుకున్నారు. కానీ ఇప్పటి వరకు ఆ పనులు చేపట్టడం లేదు. ఎందుకు చేయలేదని అధికారులు అడిగితే...ముందు చేసిన పనులకు బిల్లులు రావడం లేదని చెబుతు న్నారట. ఇక హౌసింగ్‌బోర్డులోని రాజీవ్ చిల్డ్రన్స్ పార్కులో చిన్న పిల్లలు ఆడుకునే పరిస్థితి మరిం త దారుణంగా ఉన్నాయి. దాదాపు రెండేళ్ల నుంచి అలా ఉన్నా పట్టించుకునే దిక్కు లేకుండాపోయింది. ఇక్కడా రూ.4లక్షలతో టెండరు పిలిచారు. వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసినా సైడ్‌వాల్స్ ఏర్పా టు చేయలేదు. జారుడు బల్లలు ప్రమాదకరంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

ఎక్కడ చూసినా అంతే...

నగరంలోని పార్కులో ఎక్కడ చూసినా విరిగిన బెంచీలు, వ్యాయామ పరికరాలే కనిపిస్తున్నాయి. చిన్నారులు ఆడుకునే పరికరాలు మూలన పడ్డాయి. వాకింగ్ ట్రాక్‌లు సైతం సరిగా లేవు. ఆంధ్రబ్యాంకు కాలనీలోని పార్కు, రాంనగర్ పార్కు, కోర్టు రోడ్డులో ఎమ్మెల్యే అనంత ఇంటి సమీపంలోని జన్మభూమి పార్కు, హెచ్చెల్సీ కాలనీలోని గంగానగర్ పార్కు, శారదా నగర్‌లోని పార్కు, హౌసింగ్ బోర్డులోని అభయాంజనేయ స్వామి పార్కు, అరవిందనగర్‌లోని పార్కు, అశోక్‌నగర్‌లోని వివేకానంద పార్క్, సాయినగర్ ఏడో క్రాస్ పార్క్, హౌసింగ్ బోర్డులోని సాయి బాబా గుడి వద్ద ఉన్న పార్కుల్లో చిన్న పిల్లలు ఆడుకునే వస్తువులు, వ్యాయామ పరికరాలు దెబ్బ తి న్నాయి. దీంతో ప్రజలు పార్కులకు వెళ్లడం మరిచిపోయారు. పాతూరు చెరువు కట్ట పక్కన ఏర్పాటు చేసిన పార్కు కంపచెట్లతో అధ్వానంగా తయారైంది.

వాస్తవమే... త్వరలోనే బాగు చేస్తాం

పార్కుల్లో పరికరాలు దెబ్బతినడం వాస్తవమే. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో కొంత ఆలస్య మైంది. టెండరు పిలిచిన పనుల్లో కొన్ని జరిగా యి. మరికొన్ని జరగాల్సి ఉంది. దెబ్బతిన్న పరిక రాలు, వ్యాయామ పరికరాలు. బెంచీలు, వాకింగ్ ట్రాక్‌లను గుర్తించాం. త్వరలోనే బాగు చేస్తాం.

- ప్రసన్నలక్ష్మి, డీఈ, అనంతపురం కార్పొరేషన్


నీరు-ప్రగతి పార్కులో ఉయ్యాల..


సంఘమేష్‌నగర్‌లోని పార్కులో నిరుపయోగంగా ఉన్న జిమ్, పిల్లల ఆట పరికరాలు


గంగానగర్ పార్కులో పిల్లల ఆట సామగ్రి


అభయాంజనేయస్వామి పార్కులో ప్రమాదకరంగా ఉన్న జారుడు బల్ల


హెచ్చెల్సీ కాలనీ పార్కులో..


విరిగిన జిమ్ పరికరాలు : శారదానగర్ పార్కులో..


జన్మభూమి పార్కులో ఒంటి కాలిపై వ్యాయామం


రాంనగర్ పార్కులో...


జన్మభూమి పార్కులో...

స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన పయ్యావుల



స్ట్రాంగ్ రూంల భద్రతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

అనంతపురం అర్బన్, జూన్ 2: జేఎన్‌టీయూలో ఉరవకొండ నియోజకవర్గం ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూం భద్రతను పీఏసీ చైర్మన్, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పరిశీలించారు. ఆదివారం ఆయన జేఎన్‌టీయూలో సీసీ కెమెరాల ద్వారా స్ట్రాంగ్ రూంల భద్రతను ఆయన పరిశీలించారు.

10 గంటలు.. 14 ఎకరాలు..
విత్తనం విత్తిన ఎద్దులు



రైతులను సన్మానిస్తున్న నాగేపల్లి వాసులు

కణేకల్లు, జూన్ 2: మండలంలోని నాగేపల్లి గ్రామానికి చెందిన బాలప్ప గారి లాలెప్ప ఎద్దులు 10 గంటల్లో 14 ఎకరాల భూమిలో వేరుశనగ విత్తనాలు విత్తి ఔరా అనిపించాయి. ఆదివారం ఉదయం 6 గంటలకు లాలెప్పతో పాటు అతని సోదరుడు వండ్రప్ప కలిసి గ్రామానికి చెందిన ముగ్గురు రైతుల పొలాల్లో విత్తనసాగుకు ఒప్పుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఏకధాటిగా 14 ఎకరాల్లో వేరుశనగ విత్తనాలను విత్తడంతో గ్రామస్థులతో పాటు చుట్టు ప్రక్కల రైతులు కూడా ఆశ్చర్యపోయారు. అతి తక్కువ వ్యవధిలో విత్తనాలను విత్తిన విషయాన్ని తెలుసుకున్న పలువురు రైతులు పూలమాలలు వారిని సన్మానించి గ్రామంలో ఊరేగించారు.

గుండెపోటుతో గర్భిణి మృతి



రాజమ్మ (ఫైల్)

బొమ్మనహాళ్, జూన్ 2: మండలంలోని గోవిందవాడ గ్రామంలో 8 నెలల గర్భిణి ఆదివారం గుండెపోటుతో మృతిచెందింది. గ్రామస్థులు, బంధువులు తెలిపిన మేరకు రాజమ్మ(35)ను విడపనకల్లు మండలం ఆవళిగికి చెందిన ఈశప్పకు పదేళ్ల క్రితం ఇచ్చి వివాహం చేశారు. ఈమెకు పిల్లలు కాలేదు. పదేళ్ల తర్వాత గర్భిణి అయింది. ప్రస్తుతం ఎనిమిది నెలలు ఉన్నట్లు తెలిపారు. ఈమె దర్గాహోన్నూరు ఆసుపత్రి, బెంగుళూరులో వైద్యపరీక్షలు చేయించుకునేదని తెలిపారు. ఆదివారం పాత్రలు తోముతూ ఒక్కసారిగా కుప్పకూలిందన్నారు. 108 వాహనంలో బొమ్మనహాళ్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ గుండెపోటు వచ్చిందని చెప్పడంతో బళ్లారి విమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. అంబులెన్స్‌లో కనీసం ఆశవర్కర్ గానీ, స్థానిక ఏఎన్ఎం గానీ వెళ్లలేదని గ్రామస్థులు అన్నారు. దీనిపై దర్గాహోన్నూరు వైద్యాధికారి రఫీయాసుల్తానాను వివరణ కోరగా ఆమె కొంత కాలంగా గుండెపోటుతో బాధపడుతుండేదని జాగ్రత్తగా ఉండాలని సూచించామన్నారు. వైద్యపరీక్షలు సక్రమంగానే అందిస్తున్నామని అన్నారు. గుండెపోటుతోనే ఆమె మృతి చెందిందని తెలిపారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలు..



మృతి చెందిన సంజీవమ్మ

కుందుర్పి, జూన్ 2: మండలంలోని ఎనుములదొడ్డి గ్రామానికి చెందిన సంజీవమ్మ (65) అనే వృద్ధురాలు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు సంజీవమ్మ యనమలదొడ్డి గ్రామంలో బంధువుల ఇంటి వద్ద వుంటుంది. విడపనకల్లు మండలంలోని వేపమడుగు గ్రామానికి చెందిన బండప్పకు ఇచ్చి వివాహం చేశారు. భర్త చనిపోవడంతో తన పుట్టినిల్లు అయిన తెనగల్లు గ్రామంలోని తమ్ముడు సంజీవప్ప వద్ద వుండేది. ఇటీవలే యనుములదొడ్డిలోని సమీప బంధువుల ఇంట్లో ఉంటోంది. ఇంట్లోని వారు వ్యవసాయ పనులకు వెళ్లారు. ఇంటి దగ్గర ఉన్న తాగునీటి కోసం మోటార్ ఆన్‌చేసే క్రమంలో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. పక్కింటి వారు నీటి కోసం వచ్చి చూసేసరికి విగత జీవిగా పడివుండటం చూసి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తమ్ముడు సంజీవప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జమేదార్ తెలిపారు.

వీరంగం సృష్టించిన వీరన్న అరెస్ట్

డీ.హీరేహాళ్, జూన్ 2: వేటకొడవలితో రెండురోజుల క్రితం కల్యం గ్రామంలో వీరంగం సృష్టించిన వైసీపీ నాయకుడు వీరన్నను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. కల్యం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ఎంపీటీసీ భర్త సురేష్ ప్రధాన అనుచరుడైన వీరన్న మద్యం మత్తులో వేటకొడవలి చేతపట్టి గ్రామంలో టీడీపీ నాయకులపై చిందులు వేస్తూ కౌంటింగ్ దాకా ఎందుకు ఇప్పుడే రండి ఒక్కొక్కడిని నరికిపడేస్తానని బెదిరిస్తూ హల్‌చల్ చేసిన విషయం తెలిసిందే. ఈ తతంగం మొత్తం వీడియో రూపంలో వైరల్ అవడంతో ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించిన పోలీసు అధికారులు వెంటనే కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండో పెళ్లి చేసుకున్న వ్యక్తిపై కేసు

బెళుగుప్ప, జూన్ 2: తనకు తెలియకుండా రెండో పెళ్లి చేసుకున్న భర్త వన్నూరుస్వామిపై మొదటి భార్య శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. వివరాలిలా వున్నాయి.. మండలంలోని విరుపాపల్లికి చెందిన వన్నూరుస్వామి పదేళ్ల క్రితం కాశీపురానికి చెందిన శైలజతో వివాహం కాగా వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ఇటీవల శ్రీరంగాపురానికి చెందిన మరో అమ్మాయి గీతను వన్నూరుస్వామి పెళ్లి చేసుకున్నాడు. కొన్నిరోజుల నుంచి కుటుంబానికి భర్త దూరంగా వుండటంతో ఆరా తీయగా మరో పెళ్లి చేసుకున్నట్లు బయటపడింది. పంచాయితీ చేస్తామన్న కుటుంబసభ్యులు పట్టించుకోలేదు. కట్టుకున్న భర్తలో కూడా మార్పు కనిపించకపోవడంతో న్యాయం జరగలేదన్న బాధతో శైలజ శనివారం ఫినాయిల్ తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. శైలజ ఫిర్యాదు మేరకు భర్తతో పాటు గీతమ్మలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. ఆరుగురికి గాయాలు

పెద్దవడుగూరు, జూన్2: మండలంలోని కోటకొండ గ్రామ సమీపంలో ఆదివారం ట్రాక్టర్ బోల్తాపడిన సంఘటనలో ఆరుగురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు యాడికి మండలం పుప్పాలతండాకు చెందిన పలువురు మండలంలోని చిత్రచేడు గ్రామ సమీపంలో ఉన్న అమ్మవారికి బోనాలు సమర్పించడానికి ట్రాక్టర్‌లో బయలుదేరారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్న అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. కోటకొండ సమీపంలోకి రాగానే ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడడంతో డ్రైవర్ లాలూనాయక్‌తోపాటు మరో ఐదుగురు గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వీరిని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రతి రైతుకు విత్తన వేరుశనగ అందిస్తాం: ఏఓ

రాయదుర్గంరూరల్, జూన్ 2: ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ విత్తన సాగుకు రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి రైతుకు విత్తనకాయలు అందిస్తామని ఏఓ మహేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ అందిస్తున్నట్లు తెలిపారు. 24వ తేదీ నుంచి ఇప్పటివరకు 3800.60 క్వింటాళ్ల విత్తనాలను 4222 మంది రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు.

వచ్చామా.. వెళ్లామా..!

- మాకెందుకీ తలనొప్పి.. ఆల్ రిజెక్ట్..
- తహసీల్దార్ల తీరిదీ...
- పట్టాదారు పాసుపుస్తకాల కోసం కార్యాలయం చుట్టూ రైతుల ప్రదక్షిణ
- మూడు నెలల నుంచి మంజూరు కాని వైనం
- 750 మందికిపైగా దరఖాస్తు

కళ్యాణదుర్గం, జూన్ 2: నియోజకవర్గంలో రెవెన్యూ పాలన అస్తవ్యస్తంగా మారింది. మూడు నెలల నుంచి పట్టాదారు పాసుపుస్తకాల కోసం ఆయా గ్రామాల రైతులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి నేటి వరకు అడపాదడపా పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేశారే కానీ పూర్తిస్థాయిలో చేయడం లేదు. దీంతో రైతులు దరఖాస్తు చేసుకున్న పట్టాదారు పాసుపుస్తకాలన్నీ రిజెక్ట్ చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని కళ్యాణదుర్గం పట్టణం, కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ మండలాల్లో ఇప్పటివరకు 750 మంది రైతులు పట్టాదారు పాసుపుస్తకాల కోసం ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకున్నారు. మీసేవ, సచివాలయాలు ఇలా అందుబాటులో వున్న కార్యాలయాల్లో వీటి కోసం దరఖాస్తు చేశారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఉన్న రైతులకు కూడా పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు కావడం లేదంటే పరిస్థితి ఏవిధంగా వుందో అర్థం చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు వుంటే కేవలం నెల రోజుల్లోనే పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేస్తామని రెవెన్యూ అధికారులు స్పష్టంగా చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అవి అమలుకావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు తండ్రి చనిపోతే వారసత్వంగా కుమారుడికి, భర్త చనిపోతే భార్యకు ట్రాన్స్‌ఫర్ చేసే (పోతి) పట్టాదారు పాసుపుస్తకాలు కూడా సక్రమంగా మంజూరు కావడం లేదు. కేవలం ఆ మండలాల పరిధిలో ఒకటో రెండో అన్ని పకడ్బందీగా వుంటే పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత ఇక్కడ పనిచేసే తహసీల్దార్లను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఈ మండలాలకు చిత్తూరు జిల్లా నుంచి నియమించారు. వీరు ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో మంజూరు చేయలేదు. కేవలం కొద్ది రోజులే కదా ఇక్కడ పనిచేసేది. మాకెందుకు వచ్చిందీ తలనొప్పి అంటూ దరఖాస్తు చేసుకున్న పట్టాదారు పాసు పుస్తకాలన్నీ రిజెక్ట్ చేస్తున్నారు. ఇక కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన ఒక మండల తహసీల్దార్ అయితే ఏకంగా ఒకే రోజు 85 మంది రైతుల పట్టాదారు పాసుపుస్తకాలను రిజెక్ట్ చేశారు. దీంతో ఆ మండలంలో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. మరో తహసీల్దార్ అయితే ఎన్నికల విధుల కోసం వచ్చామని, ఏ మాత్రం అదనపు పనులు చేయమని ఖరాఖండిగా కార్యాలయాలకు వచ్చిన ప్రజలకు మోహం మీదనే చెప్పేస్తున్నారు. కుల, ఆదాయధ్రువీకరణ పత్రాలు కూడా మంజూరు చేయడం లేదంటే రెవెన్యూ పరిపాలన ఏ విధంగా వుందో అర్థం చేసుకోవచ్చు. ఇక అసైన్డ్ భూముల గురించి చర్చించడమే లేదు. బ్యాంకుల్లో పంట రుణాల రెన్యువల్స్ సమయంలో ఇలా రైతులు పడరాని కష్టాలు పడుతున్నారు. కంబదూరు మండల రాళ్ల అనంతపురం గ్రామంలో చాలా మంది రైతులకు 1బీ వస్తే అడంగల్ రావడం లేదని, బ్యాంకుల్లో రెన్యువల్ చేసుకోవడానికి నానా కష్టాలు పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు.



కళ్యాణదుర్గం ఆర్డీవో కార్యాలయం

నెలరోజులుగా ప్రదక్షిణ చేస్తున్నాం

రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు వున్న భూమికి కూడా పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు కావడం లేదు. నెల రోజుల నుంచి పాసుపుస్తకం మంజూరు చేయాలని ప్రదక్షిణ చేస్తున్నా ఏ ఒక్కరు పట్టించుకోవడం లేదు. తహసీల్దార్ కార్యాలయంకు రావాలంటేనే విసుగు చెందే పరిస్థితి.

\- మారుతి, రైతు, కుందుర్పి

ఇంకెన్ని రోజులు ఈ కష్టాలు?

పట్టాదారు పాసుపుస్తకాల మంజూరుకు ఇంకెన్ని రోజులు కష్టాలు పడాల్సి వస్తోందో తెలియలేదు. అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నా పాసు పుస్తకాలు మంజూరు కావడం లేదు. దీని కోసం ఇన్ని ఇబ్బందులు పడాల్సి వస్తోంది. -సుబ్రహ్మణ్యం, రైతు, కంబదూరు

రిజిస్ట్రేషన్ పత్రాలున్నా మంజూరు కావడం లేదు

రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నా భూమికి పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు కావడం లేదు. ఒకటిన్నర నెల నుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా, ఆన్‌లైన్‌లో రిజెక్ట్ అని కొట్టేశారు. ఎందుకని ప్రశ్నిస్తే డాక్యుమెంట్లు సక్రమంగా లేవని అంటున్నారు.

\- సుబ్బరాయుడు, బ్రహ్మసముద్రం

ఉరవకొండలో భారీ వర్షం

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- రైతుల్లో ఆనందం



ఉధృతంగా ప్రవహిస్తున్న వంక

ఉరవకొండ, జూన్ 2: పట్టణంలో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. 56.2 మిల్లీ మీటర్ల వర్షం పాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. భారీ వర్షానికి ఉరవకొండలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఈదురుగాలలకు క్లాక్ టవర్ కూడలిలోని కూరగాయల మార్కెట్టులో తడికెలతో వేసిన షెడ్లు మొత్తం కూలిపోయాయి.

బెళుగుప్ప 49.8మి.మీ వర్షపాతం

బెళుగుప్ప: మండలంలో శనివారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. 49.8 మిల్లీమీటర్ల వర్షం కురవటంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కోనాపురం పాత చెరువుకు 30 శాతం వర్షపునీరు చేరింది. వరుసగా కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ రైతులలో ఆశలు చిగురింపజేస్తున్నాయి.

రాయదుర్గంరూరల్: మండలంలో శనివారం రాత్రి 33.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ చిట్టిబాబు ఆదివారం తెలిపారు. శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. శనివారం రాత్రి 10 గంటల నుంచి గంటపాటు వర్షం కురవడంతో నీటి కుంటల్లోకి, చెక్‌డ్యాంలోకి నీరు చేరింది. రుతుపవనాలు సరైన సమయంలో వరుణదేవుడు కరుణించడంతో రైతులు పంటలు పెట్టేందుకు వీలుగా ఉంటుందని చర్చించుకుంటున్నారు. వారంరోజుల నుంచి పడుతున్న వర్షానికి మంచి పదును అయినట్లు రైతులు తెలిపారు.

విడపనకల్లులో 14.5 మి.మీ

విడపనకల్లు: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. పాల్తూరు-కలవళ్లి తిప్ప గ్రామాల మధ్య ఉన్న వంక రాత్రి నుంచి మధ్యాహ్నం వరకూ ఉధృతంగా ప్రవహించింది. అలాగే పొలికి అంచనహాలు గ్రామాల మధ్య ఉన్న వంక ఉధృతికి ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆయాగ్రామాల్లోని పంట పొలాలు చెరువులను తలపించాయి. మండలంలో 14.5 మి.మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.



కోనాపురం కొత్త చెరువుకు చేరిన వర్షపు నీరు



పొంగిపొర్లుతున్న పాల్తూరు వంక

విద్యుత్ షాక్‌తో ఆవు, గేదె మృతి

బొమ్మనహాళ్, జూన్ 2: మండలంలోని రంగాపురం క్యాంపు, ఉద్దేహాళ్ గ్రామాలలో విద్యుదాఘాతానికి ఆవు, గేదె మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. రంగాపురం క్యాంప్‌లో దేవేంద్రకు చెందిన రూ.50 వేలు విలువ చేసే గేదె విద్యుత్ స్తంభం వద్ద పింగాణి పగిలిపోవడంతో వైరు తగిలి షాక్ కొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఉద్దేహాళ్‌లోని కులాయప్పకు చెందిన రూ.70 వేలు విలువ చేసే ఆవు కరెంట్ వైరు తెగిపడి ఉండడంతో తగులుకొని షాక్‌కు గురై మృతి చెందింది. ప్రభుత్వం గుర్తించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

16, 17 తేదీల్లో పరిపూర్ణ వ్యక్తిత్వ వికాస శిక్షణ

తాడిపత్రిటౌన్, జూన్2: గుంటూరు జిల్లా తూళ్లూరు మండలం నేక్కల్లులోని సావిత్రమ్మ ధ్యాన ఆరోగ్య ఆశ్రమంలో 16, 17వ తేదీల్లో పరిపూర్ణ వ్యక్తిత్వ వికాస ఉచిత శిక్షణ కార్యక్రమం ఉంటుందని స్టూడెంట్స్ టీచర్స్ ఎడ్యుకేటర్స్ పేరెంట్స్ (స్టెప్) తాడిపత్రి కన్వీనర్ సత్యప్రసాద్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల నుంచి 100 మందికి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు శిక్షణ ఇస్తారన్నారు. ఉచిత వసతి, భోజన సదుపాయం ఉంటుందని తెలిపారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

గుంతకల్లుటౌన్, జూన్ 2: పట్టణంలోని శ్రీశంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో ఆదివారం 1995-98సంవత్సరంలో బీకాం చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 25సంవత్సరాల తరువాత పూర్వవిద్యార్థులు ఒకరికొకరు పలకరించుకొని వారి జీవన స్థితిగతులు పంచుకుని ఆనందంగా గడిపారు. కళాశాలలో చదువుకున్న జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్, ప్రిన్సిపాల్ గోపాల్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్న అప్పటి అధ్యాపకులు ఎంసీ బాలయ్య, డాక్టర్ రామకృష్ణనాయుడు, రాధాకృష్ణ, రంగయ్య, నారాయణలను పూర్వ విద్యార్థులు శాలువ కప్పి పూలమాలతో సన్మానించారు. పూర్వవిద్యార్థులు మాధవి, నవీన్, షర్ఫుద్దీన్, కేదర్నాథ్ పాల్గొన్నారు.



అప్పటి ఉపాధ్యాయులతో పెద్దవడుగూరు జడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థులు



అధ్యాపకులతో పూర్వవిద్యార్థులు

పెద్దవడుగూరు: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1986-87 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరిగింది. అప్పటి గురువులైన నాగిరెడ్డి, ఆంజనేయులుకు శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం తమవంతుగా పూర్వవిద్యార్థులు పాఠశాలకు సీసీ కెమెరాలను అందజేశారు. జయరాముడు, బాలకృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, చిరంజీవులు, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- డీఎస్పీ శ్రీనివాసులు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

కళ్యాణదుర్గం, జూన్ 2: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని డీఎస్పీ బీ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం కళ్యాణదుర్గం పట్టణ పోలీస్ స్టేషన్, కంబదూరు పోలీస్ స్టేషన్‌లో ఆయా రాజకీయ పార్టీలకు సంబంధించిన నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ రోజు రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాటించాల్సిన విధివిధానాలను వివరించారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా 4వ తేదీన గ్రామంలో నలుగురు, అంతకంటే ఎక్కువ మంది గుమిగూడి వుండరాదన్నారు. కౌంటింగ్ అనంతరం విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే జిల్లా బహిష్కరణ తప్పదన్నారు. సీఐ హరినాథ్, ఎస్‌ఐ ఆంజనేయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కుందుర్పి: అందరూ సంయమనం పాటించి పోలీసులతో సహకరించాలని డీఎస్పీ బి శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. కుందుర్పి పోలీస్ స్టేషన్‌లో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఆయన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో గెలుపు ఓటములు సహజమన్నారు. అన్ని పార్టీలు నిబంధనలు పాటించాలని కోరారు. ఉల్లంగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఏ చిన్న ఘటనకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కుందుర్పి ఎస్‌ఐ వెంకటస్వామి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎవరైనా అల్లర్లు, గొడవలకు దిగినా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ జనార్దన్‌నాయుడు హెచ్చరించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ నేపథ్యంలో ఏ పార్టీ గెలిచినా కవ్వింపు చర్యలకు దిగరాదన్నారు. గతంలో జరిగిన దాడులను దృష్టిలో ఉంచుకొని పెద్దఎత్తున పోలీసు బలగాలను రప్పించామన్నారు. ప్రజలు ఎవరూ భయపడవద్దని తెలిపారు. ప్రశాంత వాతావరణం నెలకొనడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

పుట్లూరు: మండలంలో కౌంటింగ్‌రోజు అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. పుట్లూరు, ఎ.కొండాపురం గ్రామాల్లో ఆదివారం పర్యటించి గ్రామస్థులతో మాట్లాడారు. సీఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వచ్చిన నేపథ్యంలో ప్రశాంతంగా ఉండాలన్నారు. బాణాసంచా పేల్చి ఇతరులను రెచ్చగొడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలీసు బలగాల కవాతు

తాడిపత్రిటౌన్: పట్టణంలో డీఎస్పీ జనార్దన్‌నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. పుట్లూరురోడ్డు, సంజీవనగర్, టీచర్స్‌కాలనీ, భగత్‌సింగ్‌నగర్, సీబీరోడ్డులో కవాతు చేశారు. కౌంటింగ్ నేపథ్యంలో ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని డీఎస్పీ తెలిపారు. భద్రత కట్టుదిట్టం చేశామన్నారు. కవాతులో ఎస్‌ఐ గౌస్‌బాషాతో పాటు సిబ్బంది ఉన్నారు.



కవాతు చేస్తున్న పోలీసు బలగాలు

చంద్రబాబే కాబోయే ముఖ్యమంత్రి

- రైతు మారినేని ఆంజనేయులు



మాట్లాడుతున్న రైతు ఆంజనేయులు

బొమ్మనహాళ్, జూన్ 2: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేస్తారని ఓ రైతు వ్యాఖ్యానించారు. మండలం దేవగిరి గ్రామానికి చెందిన వ్యవసాయ రైతు మారినేని ఆంజనేయులు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ దైవ అనుగ్రహం వల్ల చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకుంటారని అన్నారు. రెండేళ్ల క్రితమే చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని నేను చెప్పానన్నారు. 2019లో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతాడని అన్నానని తెలిపారు. అది నిజమైందని, 2009లో రెండోసారి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతానన్నారు. ఆరునెలల్లో పదవిలో ఉండడని చెప్పానని గుర్తు చేశారు. 2024లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం వందశాతం జరుగుతుందని ఇది నిజం కాకపోతే మరి ఎప్పుడు విజయావకాశాలు గురించి ఎక్కడా మాట్లాడనన్నారు. మోహన్ నాయుడు, పలమనేరు రాజన్న, రామలింగ పాల్గొన్నారు.

నిఘా నీడన యాడికి

యాడికి, జూన్ 2: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా యాడికి, రాయలచెరువు తదితర సమస్యాత్మక గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. సీఐ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ కౌంటింగ్ రోజున ప్రతి ఒక్కరి కదలికలను సీసీ కెమెరాల ద్వారా పరిశీలించనున్నట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలను దృష్టిలో ఉంచుకొని యాడికి, వేములపాడు, రాయలచెరువు, కోనుప్పలపాడు, గుడిపాడు తదితర గ్రామాల్లో సీసీ కెమెరాలు అమర్చినట్లు తెలిపారు.

మొబైల్ టీం ఏర్పాటు

పెద్దవడుగూరు: మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మొబైల్ టీం ఏర్పాటుచేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎలాంటి సంఘటనలు జరిగినా తక్షణమే స్పందించి సంఘటనా స్థలానికి వెళ్లేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

మద్యం దుకాణాలు కిటకిట



యాడికిలో వైన్‌షాపు వద్ద క్యూకట్టిన మద్యం ప్రియులు

యాడికి, జూన్ 2: మండలంలోని యాడికి, రాయలచెరువులోని మద్యం దుకాణాలు ఆదివారం మద్యం ప్రియులతో కిటకిటలాడాయి. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మూడురోజులు మద్యంషాపులు బంద్ చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో మద్యంప్రియులు ఆదివారం ఉదయం నుంచి మద్యం దుకాణాల వద్ద గుంపులుగుంపులుగా కనిపించారు. కొందరు మద్యం ప్రియులు మాట్లాడుతూ జె- బ్రాండ్‌లు తప్ప వేరే ఏవీ లభించడం లేదన్నారు. మద్యం ఫుల్‌బాటిళ్లు, హాఫ్‌బాటిళ్లు కూడా లేవని కేవలం రూ.150, 160ల చీప్ లిక్కర్ క్వార్టర్ బాటిళ్లు మాత్రమే విక్రయిస్తున్నారని తెలిపారు. ఫుల్, హాఫ్ బాటిళ్లను దుకాణాలను తెరవకముందే పక్కదారి పట్టించారని మద్యం ప్రియులు ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు రుక్మిణీపాండురంగస్వామి రథోత్సవం

బొమ్మనహాళ్, జూన్ 2: మండలంలోని ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామి రథోత్సవం సోమవారం సాయంత్రం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఏటా వైశాఖమాసం బహుళ ఏకాదశి సందర్భంగా ఉదయం స్వామివారి రథోత్సవం నిర్వహిస్తామన్నారు. గంగాజలం తెచ్చి శ్రీవారిని అభిషేకించి విశేషపూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం రథోత్సవం ఆలయం నుంచి ప్రధాన వీధిలోని ఎదురు బసవణ్ణ దేవాలయం వరకు లాగుతున్నట్లు తెలిపారు. పండరీపుర పీఠాధిపతి గోపాల్‌రాజ్ పూజలను జరిపించిన అనంతరం రథోత్సవాన్ని లాగుతున్నట్లు తెలిపారు.

దశభుజ గణపతికి ప్రత్యేక పూజలు

రాయదుర్గంరూరల్, జూన్ 2: పట్టణంలోని దశభుజగణపతి ఆలయంలో స్వామివారికి ఆదివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్వామివారికి ఉదయాన్నే అర్చకులు గంగపూజ, పసుపుకుంకుమతో అర్చన, వస్త్రలంకరణ, పూల అలంకరణ తదితర పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మహామంగళహారతి, తీర్థ ప్రసాదాలు గావించారు.

జానపద, హస్తకళలను కాపాడుకుందాం

కుందుర్పి,జూన్ 2: మన జానపద, హస్తకళలను కాపాడుకుందామని సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు అన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో ఏపీ శాస్త్ర సాంకేతిక మండలి విజయవాడ వారి సహకారంతో నిర్వహిస్తున్న విలువల బడి వేసవి శిబిరాలలో ప్రాచీన జానపద, హస్తకళారూపాల విశిష్టతను విద్యార్థులకు తెలియజేసేలా ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. తోలుబొమ్మలాట, మట్టితో, కాగితాలతో వివిధ ఆకృతులను తయారు చేయడం నేర్పించారు. విద్యార్థులు చిత్రాలను, చిన్న తెరలను తయారు చేసుకుని చక్కటి వ్యాఖ్యానంతో తెరపై బొమ్మలతో చేసిన ప్రదర్శన అందరినీ ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆయా గ్రామాల విలువల బడి ఉపాధ్యాయులు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

టపాసులు స్వాధీనం

గుంతకల్లుటౌన్, జూన్ 2: అక్రమంగా నిల్వ ఉంచిన టపాసులను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య ఆదివారం రాత్రి తెలిపారు. పట్టణంలోని రామస్వామి స్ట్రీట్‌లో నివాసముంటున్న ఫణిభూషణ్ ఇంట్లో లైసెన్స్‌లు లేకుండా అక్రమంగా టపాసులు నిల్వ చేశాడు. సమాచారం అందుకున్న సీఐ దాడులు నిర్వహించారు. అతని వద్ద నుంచి రూ.2,71,070 విలువ చేసే టపాసులను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.